
ఈనాడు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం 31 ఆగస్టు 2017 | పేజీలు 16

సర్వం సిద్ధం!



రెండో ప్రయోగ వేదిక వద్ద పీఎస్ఎల్వీ-సి39 వాహకనౌక

నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ-సి39

షార్‌కు చేరుకున్న ఇస్రో అధిపతి

శ్రీహరికోట, న్యూస్‌టుడే

పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సి39 రాకెట్ ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సర్వం సిద్ధం చేసింది. శాస్త్రవేత్తలు నిర్ణయించిన మేరకు గురువారం సాయంత్రం ఏడు గంటలకు నింగిలోకి పీఎస్ఎల్వీ రాకెట్ దూసుకెళ్లనుంది. ప్రయోగం దృష్ట్యా షార్ అంతటా సందడి నెలకొంది. ఇస్రోలోని వివిధ విభాగాలకు చెందిన సంచాలకులు, సీనియర్ శాస్త్రవేత్తలు అందరూ షార్‌కు చేరుకోవడంతో అతిథి భవనాల వద్ద, మిషన్ కంట్రోల్ సెంటర్, ఎల్‌సీసీ వద్ద వారి వారి విధుల్లో నిమగ్నమయ్యారు. బుధవారం మధ్యాహ్నం కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా పీఎస్4 దశలో రిమోట్ ట్రెయిల్ సీబీహెచ్ తనిఖీలు నిర్వహించారు. పీఎస్4లో ఎంఎంహెచ్ ఫిలింగ్ చేశారు. ఆ తర్వాత దశల వారీగా రాకెట్ అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఇంధనం, తదితర వాటిని నింపుతున్నారు. గతంలో షార్ నుంచి భారీ రాకెట్లను శాస్త్రవేత్తలు అవలీలగా పంపడంతో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు పెద్దగా ఆందోళనకు గురికావడం లేదు. ముందుగా రాకెట్ ప్రయోగాన్ని గురువారం సాయంత్రం 6.59 గంటలకు నిర్ణయించారు. అయితే అంతరిక్షంలో వ్యర్థాల కారణంతో మరో నిమిషం అలస్యంగా ప్రయోగం చేయనున్నారు. అందుకు తగ్గట్లు శాస్త్రవేత్తలు కౌంట్‌డౌన్ కార్యక్రమం ఏర్పాట్లు చేసుకున్నారు. రాకెట్ అనుసంధాన కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి పీఎస్ఎల్వీ ప్రాజెక్టు డైరెక్టర్ జయకుమార్ షార్‌లోనే ఉండి అన్ని ఏర్పాట్లల్లో తలమునకలై ..7లో

రూ.కోటికి కన్నం!

నగరపాలక సంస్థ రెవెన్యూ లీలలో ఇదో కోణం. కంప్యూటర్లను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారు. లెక్కల్లో గోల్‌మాల్ చేస్తున్నారు. ఏడాదిగా ఇదే తంతు. పట్టణ ప్రణాళికా విభాగం జారీ చేసిన నిర్మాణ అనుమతులకు , వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. వాటిని పరిశీలించి వాస్తవ కొలతలతో పన్ను విధించాల్సి ఉంది. రెవెన్యూ విభాగంలో కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుతో ఖజానాకు కన్నం పడుతోంది. వేల సంఖ్యలో పన్ను మందింపులు ఇదే తీరులో జరిగాయి. జరిమానా రూపేణా నగరపాలక సంస్థకు రావాల్సిన మొత్తానికి కన్నం పడింది. అది కాస్తా కొందరు సిబ్బంది జేబుల్లోకి వెళ్లింది.

సాంకేతికతకూ చిక్కని అక్రమం


ఖజానాకు సున్నం

నిండిన కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది జేబులు

పన్ను మదింపులో ఇదో లీల

ఈనాడు-నెల్లూరు

భవనాల ప్లాన్‌లకు అనుమతి ఇవ్వటంలో పట్టణ ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్లాన్ జారీలో అక్రమాలను నియంత్రించటానికి మున్సిపల్ పరిపాలనా విభాగం సాంకేతికతను జోడించింది. ఇందులో భాగంగా ప్లాన్‌ల మంజూరు నుంచి పన్ను మదింపు వరకు కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో పూర్తి చేసే విధంగా ఏర్పాటు చేశారు. ఎక్కడి నుంచైనా ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని పట్టణ ప్రణాళికా ..13లో



పచ్చదనంలో అవినీతి చిగుళ్లు!



శకునాలపల్లి నర్సరీలో సంచుల్లో కేవలం మట్టిని మాత్రమే నింపుతున్న కూలీలు

పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటంతోపాటు మానవ మనుగడకు చెట్లు ఎంతగానో ఉపకరిస్తాయి. ఇందులో భాగంగా వనం-మనం కార్యక్రమంతోపాటు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రైతుల పొలాల్లో గట్లపై, పంచాయతీల్లో రోడ్లకు ఇరువైపులా చెట్లను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఉపాధి పథకం ద్వారా రూ. కోట్ల నిధులను ఖర్చుచేస్తూ చెట్ల పెంపకానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచి ఉచితంగా అందజేయాల్సి ఉంది. ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయిలో నర్సరీల బాధ్యతలను చూసే అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ లోపంతో నిబంధనల ప్రకారం మొక్కల పెంపకం జరగడం లేదు. పచ్చదనం పెంపకంలో చోటు చేసుకుంటున్న అవినీతిపై 'టాస్క్‌ఫోర్సు' కథనం 16

పెన్నమ్మపై పెత్తం దారులు!

ఇసుక రవాణాలో ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా అమలు కావటం లేదు. అందరికీ ఉచితంగా సరఫరా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి కొందరు స్వార్థపరులు తూట్లు పొడుస్తున్నారు. జిల్లాలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు 28 ప్రాంతాల్లో మాత్రమే ప్రభుత్వం అనుమతినివ్వగా పెన్నా, స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లోని అన్ని చోట్లా దొడ్డిదారిన కొల్లగొడుతున్నారు. కొందరు రవాణా దారులు మాఫియాగా ఏర్పడి ప్రభుత్వ ధరను పక్కన పెట్టి సొంతంగా నిర్ణయించి బలవంతంగా వసూళ్లు చేస్తున్నారు. పొర్లుకట్టలను సైతం ధ్వంసం చేయటం, మీటర్ల కొద్దీ గుంతలు పెట్టి తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటి ప్రజలు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెన్నా, స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై 'న్యూస్‌టుడే' కథనం. 7



పొదలకూరు: ఇరువూరు రీచ్ సంగం బ్యారేజీ వద్ద ఇసుక తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో మంత్రి సోమిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు .. 6లో

జాతర నిర్వహణకు రాజాల సమ్మతి 11

సెప్టెంబరు 11 నుంచి సమ్మెటివ్-1 పరీక్షలు 12

ప్రతిభను తట్టి.. తీర్చిదిద్ది!

క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆర్థిక పరిస్థితులు బాగా లేక క్రీడలకు దూరమవుతున్న వారిని గుర్తించి వారికి మంచి పౌష్టికాహారంతో పాటు నిపుణులచే ఉచితంగా శిక్షణ ఇచ్చే విధంగా దీన్ని రూపొందించారు. దీంతో విద్యార్థి ఓ వైపు చదువుకుంటూనే క్రీడల్లో రాణించేందుకు అవకాశాలుంటాయి. గతంలో ఉన్న విధానానికి తుది మెరుగులు దిద్ది ఈ సారి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం క్రీడా విధానాల్లో భాగంగా 'డే బోర్డర్' అనే పేరుతో ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఎంపికలు ప్రారంభించనున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు మంచి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్‌తో పాటు ఖోఖో క్రీడలకు అవకాశం కల్పించారు.

- ప్రభుత్వ కొత్త పథకం 'డే బోర్డర్'
- పౌష్టికాహారంతో పాటు ఉచిత శిక్షణ
- చదువుకుంటూనే అవకాశం
- గ్రామీణ క్రీడాకారులకు వరం
- రేపటి నుంచి ఎంపికలు

నెల్లూరు (వీఆర్సీ సెంటరు), న్యూస్‌టుడే

జిల్లాలో నెల్లూరు నగరంతో పాటు గూడూరు, కావలి, నాయుడుపేట, ఆత్మకూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలోని గ్రామాల్లో విద్యార్థులకు అవసరమైన క్రీడా మౌలిక సదుపాయాలు లేవు. ఖోఖో, అథ్లెటిక్స్ లాంటి ఆటలకు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచే క్రీడాకారులు వస్తుంటారు. అయితే వారికి క్రీడా వనరులు లేకపోవడంతో చాలా మంది పూర్తిస్థాయిలో తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించలేకపోతున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోటీల్లో పాల్గొంటున్న వీరు.. రాష్ట్ర స్థాయి పోటీలకు వచ్చే సరికి దూరమవుతున్నారు. సరైన శిక్షణ లేకపోవడం, ఆర్థిక కష్టాలే ప్రధాన కారణం. ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోల్చుకుంటే శారీరక పుష్టి దగ్గర నుంచి క్రీడల్లో మెలకువలు, చొరవ వంటి వాటిలో వెనుకబడుతున్నారు. ఈ పరిస్థితిని పరిశీలించిన ప్రభుత్వం రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేలా సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఈ 'డే బోర్డర్' అనే వినూత్నమైన పద్ధతిని ప్రవేశపెట్టింది.



మైదానంలో ఆడుతున్న క్రీడాకారులు

13 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన క్రీడాకారుడికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి రుచిశుచి గల పౌష్టికాహారం అందించనున్నారు. క్రీడాపరమైన మెనూ ప్రకారం ఉదయం రెండు కోడి గుడ్లతో పాటు గ్లాసు పాలు అందిస్తారు. మధ్యాహ్నం తేలికపాటి ఆహారం ఇస్తారు. రాత్రి మాంసాహారం వడ్డిస్తారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుంది. రాత్రి ఎవరికి వారు తమ ఇళ్లకు వెళ్లిపోవాల్సి ఉంటుంది. విద్యార్థి అభ్యశించే తరగతిని బట్టి శిక్షణస్థాయి ఉంటుంది. మైదానానికి దూరంగా ఉన్న క్రీడాకారుల కోసం ఆయా విద్యాసంస్థలకే మధ్యాహ్న భోజనం అందజేస్తారు. జిల్లా కేంద్రంలో 45 మంది క్రీడాకారులకే ఈ అవకాశం ఉంది. అథ్లెటిక్స్‌లో 20 మంది, మిగతా ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, ఖోఖో క్రీడలకు 25 మందిని ఎంపిక చేస్తారు. వచ్చే నెల ఒకటోతేదీన ఎంపికలు నిర్వహిస్తారు. ప్రతిభ ఆధారంగానే ఎంపిక ఉంటుంది. పేర్ల జాబితాను ప్రభుత్వానికి పంపిస్తారు. అక్కడ నుంచి అనుమతులు వస్తాయి. సెప్టెంబరు నుంచి ఈ విధానంలో ప్రారంభమయ్యేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

విద్యా సంస్థలకూ అవకాశం

400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌తో పాటు ఇతర అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించే మైదానాలు, ఇతర క్రీడా వనరులు కలిగిన జూనియర్, డిగ్రీ కళాశాలలు కూడా ఈ డే బోర్డర్ కేంద్రం ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. తమకు ఉన్న అర్హతలకు సంబంధించిన వివరాలతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థకు దరఖాస్తు చేస్తే.. పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. అనంతరం పరిశీలన ప్రక్రియ పూర్తయిన తరువాత అనుమతి వస్తుంది. దీంతో ఆయా కళాశాలల్లో చదివే విద్యార్థులకు క్రీడల్లో ఉచితంగా శిక్షణతో పాటు పౌష్టికాహారం అందనుంది. ఈ అవకాశం గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలలకు ఎంతో వెసులుబాటు కానుంది.

భావి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకే..

– పీవీ రమణయ్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

భావిభారత క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నాణ్యమైన శిక్షణ అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపించగలుగుతారనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది క్రీడాకారులకు ఒక వరం లాంటిది. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచిది. తమలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇదొక సువర్ణవకాశం.

సమాచార స్రవంతి

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	96
రిటైల్	111
లేయర్	82
బ్రాయిలర్స్	155
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	183
లేయర్ మాంసం	140
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	105
లేయర్	82
బ్రాయిలర్స్	172
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	202
లేయర్ మాంసం	140

బంగారం ధరలు

గ్రాము ధర	రూ. 2830
సవర ధర	రూ. 22,640
వెండి కిలో	రూ. 42,700
వెండి గ్రాము	రూ. 42.70

నిమ్మమార్కెట్ ధరలు

గూడూరు	
సన్నవి	రూ॥ 2,000
పెద్దవి	రూ॥ 4,000
పొదలకూరు	
సన్నవి	రూ॥ 1,000
పెద్దవి	రూ॥ 2,000

ఉపాధి లెక్క.. ఇక పక్కా!

గ్రామ, మండలస్థాయిలో ప్రత్యేక రిజిష్టర్లు

పారదర్శకత, పర్యవేక్షణకు కేంద్రం పెద్దపీట

అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దుత్తలూరు మండలంలో 2016-17 ఆర్థిక సంవత్సరంలో జరిగిన సుమారు రూ. 11 కోట్ల విలువైన ఉపాధిహామీ పనుల్లో సామాజిక తనిఖీ బృందాలు, జిల్లా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగా భారీ ఎత్తున అక్రమాలు బయటపడ్డాయి. మండలంలో సుమారు రూ.5 కోట్లకుపైగానే అవినీతి జరిగినట్లు జిల్లా అధికారులు లెక్కతేల్చారు. అవినీతి జరిగిన సొమ్మును సంబంధిత అధికారులు, నాయకుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు.

కలువాయి మండలంలో 2016-17లో రూ.5.44 కోట్ల మేర ఉపాధి హామీ పనులు చేశారు. అయితే ఈ మండలంలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం బహిరంగ చర్చావేదికలో సామాజిక తనిఖీ బృందం ఇచ్చిన నివేదిక మేరకు మండలంలో రూ.13.74 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు.

సీతారామపురం మండలంలో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ చర్చావేదికల్లో కూడా ఉపాధిహామీ పథకం నిధులు భారీ ఎత్తున దుర్వినియోగమైనట్లు తేటతెల్లమయ్యింది. పనులు చేయకుండానే చేసినట్లుగా దస్త్రాల్లో నమోదుచేసి ఉపాధి నిధులను దిగమింగారు. ఈ మండలంలో సుమారు రూ. 84 లక్షల మేర ఉపాధి నిధులు పక్కదారి పట్టాయి.

న్యూస్‌టుడే, దుత్తలూరు

జిల్లాలో కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో పారదర్శకత, పర్యవేక్షణ కొరవడటంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పనులపై ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో రూ. కోట్లలో అక్రమాలు బయటపడుతున్నాయి. వెలుగులోకి రాని అవకతవకలు మరెన్నో ఉంటున్నాయి. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల వివరాలు ఎవరికీ తెలియకపోవడమే ఇందుకు కారణం. ఈ పథకం కింద పనులు చేపడుతున్నా.. తమది కాదులే అన్న రీతిలో మిగతా ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఎంపీడీవోలు కూడా ఉపాధిహామీ క్షేత్ర సిబ్బంది సిద్ధం చేసిన దస్త్రాలపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో చేపడుతున్న ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఈ పరిస్థితులను గుర్తించిన కేంద్రప్రభుత్వం ఉపాధి పథకం కింద చేపట్టే పనుల వివరాలు పక్కాగా ఉండేలా చర్యలు చేపట్టింది. గ్రామ, మండల స్థాయిలో తప్పనిసరిగా ప్రత్యేకంగా రిజిష్టర్లు నిర్వహిస్తూ ఉపాధి పనుల వివరాలను వాటిలో పక్కాగా నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉపాధి పనులను ఇకపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు విధిగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ఆయా గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలకు సంబంధించి ప్రత్యేక దస్త్రాలు (రిజిష్టర్లు) తయారుచేయడానికి ఉపాధిహామీ పథకం సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక బృందం త్వరలో జిల్లాకు వచ్చి ఉపాధి పనులను పరిశీలించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఏడు రిజిష్టర్లు

ఉపాధిహామీ పథకంలో గ్రామస్థాయిలో చేపట్టిన పనులు, చేయనున్న పనులకు సంబంధించి మొత్తం ఏడు రిజిష్టర్లను విధిగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పంచాయతీ కార్యదర్శి సమక్షంలో వీటిని నిర్వహించడంతోపాటు ఇందుకోసం క్షేత్ర సహాయకుడిని పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది.

ఫిర్యాదులపై చర్యలకు ప్రత్యేక దస్త్రం

ఉపాధి పనులపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. చేసిన పనులకు కూలీ సక్రమంగా రావటంలేదని, మస్టర్లు సరిగా వేయడం లేదని, పనిచేసే చోట సదుపాయాలు కల్పించడంలేదని, కూలీలకు పనులు చూపించడంలేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. వీటికి తోడు క్షేత్రస్థాయిలో సహాయకుల అక్రమాలు, మస్టర్ల మాయాజాలంపైనా ఆరోపణలు కోకొల్లలు. వీటన్నింటిపై అధికారులు విచారణ చేసి ఏం చర్యలు తీసుకున్నారనే వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక రిజిష్టర్ (దస్త్రం)ను నిర్వహించాలి. ఇకపై గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేసే పనులు, చేపట్టే పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శికి తెలిసే ఉండాలి. లేకుంటే కార్యదర్శిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. ఆ గ్రామంలో ఉపాధి పనులను విధిగా పరిశీలించి నివేదిక సమర్పించాలి. పథకంలో లోపాలు ఏం జరిగినా ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలను బాధ్యులను చేయనున్నారు.

రిజిష్టర్లను పక్కాగా నిర్వహిస్తాం

– హరిత, డ్వామా పీడీ

జిల్లాలో ఉపాధిహామీకి సంబంధించి పంచాయతీల్లో ప్రత్యేక రిజిష్టర్లు నిర్వహించాలని గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. రిజిష్టర్ల తయారీపై మండల, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో మాట్లాడి కార్యరూపంలోకి తీసుకు వస్తున్నాం. దీంతోపాటు అన్ని మండల, పంచాయతీ కేంద్రాల్లో సమాచార బోర్డులను ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

దస్త్రాల్లో నమోదు చేసే అంశాలివే

గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల కేటగిరీ వారీగా నివేదికను తయారు చేయాలి. ప్రతి పనికి సంబంధించి ఫొటోతో పాటు ఆ పని పూర్తి వివరాలు పొందుపరచాలి. పని ప్రతిపాదన మొదలు అంచనా తయారీ, ఆమోదం, మార్పులు, ఎంతమంది కూలీలు హాజరయ్యారు? మెటీరియల్‌కు చేసిన వ్యయం ఎంత? పనులను ఎవరు పర్యవేక్షించారు? ఏయే తేదీల మధ్య పనులు జరిగాయి? ఈ వివరాలన్నీ నమోదు చేయాలి. దస్త్రాలను నిర్వహించడంతో పాటు కంప్యూటరీకరణ కూడా చేయాలి. జాబ్‌కార్డుదారుల వివరాలను నమోదు చేసి ఏయే పనులు చేయడానికి ఆసక్తి చూపుతున్నారనే వివరాలను దస్త్రాల్లో రాయాలి. మండలస్థాయిలో రిజిష్టర్లను ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహించాలి. కూలీల హాజరు, వారి వేతనాల చెల్లింపులు, ఆయా గ్రామాల్లో చేసిన పనుల నాణ్యతకు సంబంధించి వివరాలుండాలి. సామాజిక తనిఖీ బృందాల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభల్లో స్థానిక ప్రజలు లేవనెత్తిన అంశాలు రాయాలి. ఈ దస్త్రాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలి. ఉపాధిహామీ పథకం ద్వార చేసే పనుల వివరాలను ఆయా పనులు జరిగే ప్రదేశాల్లోనే ప్రదర్శించాలి. చెరువులు, సీసీ రహదారులు, శ్మశానవాటికల అభివృద్ధి, చెక్‌డ్యాంలు, మరుగుదొడ్లు, పంట సంజీవని కుంటలు, చెట్ల పెంపకం తదితర పనులు ఉపాధిహామీ నిధులతో చేపడుతున్నారు. వీటికి ఎంత ఖర్చు పెడుతున్నారు? కూలీలు ఎంత మంది హాజరవుతున్నారు? అంచనా విలువ.. ఎంత ఖర్చు చేశారనే వివరాలు స్పష్టంగా రాసి వాటిని అక్కడే ప్రదర్శించాలి. ఈ పద్ధతిని ఎప్పటినుంచో పాటించాలని చెబుతున్నా జిల్లాలో ప్రారంభంలో బాగానే ఉన్నా అనంతరం దానిని ఆచరించటంలేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దస్త్రాలను నిర్వహించాలని ఆదేశించడంతో వాటితో పాటు సమాచార బోర్డులను ఏర్పాటు చేయడానికి డ్వామా చర్యలు తీసుకుంటోంది.

విశ్రాంత రెవెన్యూ అధికారుల అవినీతిపై విచారణకు ఆదేశం



కలెక్టర్ ఆదేశాలను చూపుతున్న ప్రతాప్‌రెడ్డి

అనంతసాగరం (సోమశిల), న్యూస్‌టుడే : అనంతసాగరం మండలంలో 2012లో తహశీల్దారుగా పనిచేసిన కృష్ణకాంత్, పడమటికంభంపాడు వీఆర్వోగా పనిచేసిన శేషయ్య కమ్మవారిపల్లిలోని సర్వే నెంబరు 23-3లో 17 సెంట్లు, సర్వే నెంబరు 7-1లో 27 సెంట్ల భూమి తన తల్లి రామసుబ్బమ్మ పేరున ఉండగా, దాన్ని ఇతరుల పేరున 10(1)అడంగల్‌లో మార్చారని, దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాల్సిందిగా కమ్మవారిపల్లికి చెందిన ప్రతాప్‌రెడ్డి 2013లో లోకాయుక్తను ఆశ్రయించారు. దీనిపై విచారణ చేసి అభ్యంతరాలను లోకాయుక్తకు తెలియజేయాలని లోకాయుక్త న్యాయమూర్తి అప్పటి కలెక్టర్ శ్రీధర్‌ను ఆదేశించారు. అప్పటి నుంచి ఆ విచారణలో జాప్యం నెలకొంది. దీనిపై ప్రతాప్‌రెడ్డి మరోసారి ఈ సంవత్సరం జులైలో స.హ. చట్టం కింద కలెక్టర్ ముత్యాలరాజును ఆశ్రయించారు. దీంతో ఆయన స్పందించారు. అప్పట్లో ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు తయారుచేసిన దస్త్రాలను ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయానికి స్వాధీనం చేయాలని అనంతసాగరం తహశీల్దారును ఆదేశించారు.

యోగాపై అవగాహన సదస్సు

కావలి, న్యూస్‌టుడే : కావలి మండలం కొత్తపల్లిలో ఎస్ఎస్‌కే గ్లోబల్ డయాబెటీస్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా యోగాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు హఫీజ్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి ఉన్నవారు రోజు వ్యాయామం చేయాలని సూచించారు. ఆహార నియమాలు పాటించడం వల్ల షుగర్‌వ్యాధి అదుపులో వుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా 70 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు.

కొనసాగుతున్న వినాయకుడి నిమజ్జనాలు

అల్లూరు, న్యూస్‌టుడే : అల్లూరు మండలంలో వినాయకుడి నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. డప్పుల శబ్దాలతో ఊరేగింపులతో కార్యక్రమాలు జరుగుతున్నాయి. భక్తులను అలరించేందుకు పాటకచ్చేరి లాంటివి ఏర్పాటు చేశారు. బుధవారం పలు ప్రాంతాల్లో పాటకచ్చేరీలు భక్తులను అలరించాయి.

మెగా లోక్ అదాలత్ విజయవంతానికి పిలుపు

కావలి (లీగల్), న్యూస్‌టుడే : దేశ వ్యాప్తంగా జరిగే మెగా లోక్ అదాలత్‌లో భాగంగా సెప్టెంబరు 9వ తేదీ నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.జె.సుధ కోరారు. కావలి పట్టణంలోని కోర్టు భవన సముదాయంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.జె.సుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబరు 9వ తేదీ కావలి కోర్టులో నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతంచేసి జిల్లాలో అత్యధికంగా కేసులను పరిష్కరించే దిశగా కావలి కోర్టులను ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ జానీ బాషా, అడిషినల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ చైతన్య, ప్రభుత్వ న్యాయవాది పోట్లూరు శ్రీనివాసులు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు కె.చక్రపాణి, సునీల్ కుమార్ సింగ్, రుషికుమార్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, బ్యాంకు అధికారులు, కార్మిక శాఖ అధికారులు, లోక్ అదాలత్, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ పి.జె.సుధ

దౌర్జన్యాలను సంఘటితంగా ఎదుర్కొందాం

కావలి (న్యాయవిభాగం), న్యూస్‌టుడే : రోజురోజుకి న్యాయవాదులపై జరుగుతున్న దౌర్జన్యాలను, అవమానాలను న్యాయవాదులందరూ కలిసి సంఘటితంగా ఎదుర్కోవాలని కావలి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చక్రపాణి కోరారు. కావలి పట్టణంలోని న్యాయవాదుల సంఘ సమావేశ మందిరంలో బుధవారం న్యాయవాదుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంగళవారం సాయంత్రం న్యాయవాది మల్లికార్జున్ తన ద్విచక్ర వాహనంపై ముసునూరులోని తన ఇంటికి వెళుతుండగా బృందావనం కాలనీ వద్ద కావలి 1వ పట్టణ ఎస్.ఐ నాగరాజు బండిని ఆపి లైసెన్స్‌ను చూపించమని అడుగగా మల్లికార్జున్ ఎల్.ఎల్.ఆర్ లైసెన్సు పొంది ఉన్నట్లు ఎస్ఐకు చూపారు. ఆ సమయంలో పరుష పదజాలంతో దూషించి తన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని అవమానించారని బార్ అసోసియేషన్ తరపున తనకు న్యాయం చేయమని కోరిన మీదట ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. న్యాయవాదులపై పోలీసులు అక్రమంగా దౌర్జన్యాలు చేయకుండా వారికి చట్టపరమైన శిక్షలు విధించేట్లుగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీనియర్ న్యాయవాది జి.మాల్యాద్రి, రెహమాన్, కెనడి, జి.రాజేంద్రప్రసాద్, జగన్మోహన్‌రావు మాట్లాడారు. కోర్టులో పోలీసుల తరపున కావలి న్యాయవాదులెవ్వరూ వాదించకుండా సంఘటితంగా ఉండాలని పలువురు కోరారు. అనంతరం న్యాయవాదులు సురేంద్ర రెడ్డి, నాగేంద్రబాబు మాట్లాడారు.

డీఎస్పీకి ఫిర్యాదు

కావలి (లీగల్) : కావలి న్యాయవాది మల్లికార్జున్‌పై వన్‌టౌన్ ఎస్.ఐ నాగరాజు అనుచిత ప్రవర్తన, దౌర్జన్యానికి వ్యతిరేకంగా కావలి న్యాయవాదులందరూ అధ్యక్షుడు కె.చక్రపాణి ఆధ్వర్యంలో కలిసి డి.ఎస్.పి రామవరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జరిగిన విషయం నా దృష్టికి వచ్చిందన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

రుద్రకోట(కావలి గ్రామీణం), న్యూస్‌టుడే : మండల పరిధిలోని రుద్రకోట గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థుల్లోని వృత్తి నైపుణ్యాలపై వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వృత్తివిద్య ఇంజినీరింగ్ విద్యార్థులు సొంత ఆలోచనలతో తయారు చేసిన హైడ్రాలిక్ బ్రిడ్జి నమూనా, ఫైర్ స్ప్రింకర్లు, ఆటోమ్యాటిక్ లైట్స్ ఆఫ్ఆన్, తదితర నమూనాలు పదర్శనల్లో పలువురిని ఆకట్టుకున్నాయి.



విద్యార్థులు తయారు చేసిన హైడ్రాలిక్ బ్రిడ్జి నమూనా

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పద్మారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు, తమ నైపుణ్యంతో చక్కగా ప్రాజెక్టు నమూనాలను తయారు చేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ నమూనాలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రదర్శిస్తామన్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించేందుకు డీఈఈ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు ఎం, సుబ్బరాయుడు, డాక్టర్ పి. వరప్రసాద్, వైజ్ఞానిక ప్రదర్శన కో ఆర్డినేటర్ సుబ్బన్న, అధ్యాపకులు తిరుపతి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌పై ప్రచారం

చేజర్ల, న్యూస్‌టుడే : భాగస్వామ్య పింఛను విధానం రద్దు చేయాలని ఉద్యోగ సంఘాలు తల పెట్టిన మిలియన్ మార్చ్ విజయవంతం చేయాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య బుధవారం మండలంలోని పాఠశాలల్లో బుధవారం ప్రచార కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం. రవిబాబు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణారెడ్డి, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యం

బిట్రగుంట, న్యూస్‌టుడే : రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి సుబ్బారావు, చైర్మన్ గోవిందరాజులు పేర్కొన్నారు. బుధవారం బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిట్రగుంట రైల్వేలోని వివిధ విభాగాల్లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చకు వచ్చాయి. సాధించిన విజయాలు, చేపట్టబోయే కార్యక్రమాలపై కార్యదర్శి, చైర్మెన్ వివరించారు. అనంతరం వివిధ కార్యాలయాలకు వెళ్లి అక్కడ కార్మికులు, అధికారులతో సమస్యలపై చర్చించారు. బిట్రగుంట రైల్వే ఆసుపత్రికి వెళ్లి వైద్యపరంగా మెరుగు పరచాల్సిన సౌకర్యాలు, సేవలు విషయమై తెలుసుకున్నారు. డివిజనల్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వైద్యసేవలు మెరుగుకు కృషిచేస్తామన్నారు. అనంతరం మజ్దూర్ యూనియన్ కార్యాలయ ప్రాంగణం, జార్జిఫెర్నాడెస్ వేదిక ప్రాంతంలో నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు పి.గోవిందరాజులు, కార్యదర్శి ఎంఎస్.సుబ్బారావు, కోశాధికారి వి.రమణయ్య, సహాయ కార్యదర్శులు ఏ.చలపతిరావు, టి.రాజశేఖర్, వైస్ చైర్మన్ బీఎస్ మైఖేల్, డి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

వైకుంఠపురం(కావలి పట్టణం), న్యూస్‌టుడే : ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుర అధ్యక్షురాలు అలేఖ్య పేర్కొన్నారు. కావలి పట్టణంలోని వైకుంఠపురం మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలేఖ్య మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కళ్లు ఎంతో ముఖ్యమైనవని అటువంటి కళ్లపట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. తగిన ఆకుకూరలు తింటే కళ్లకు ఎంతో మంచిదన్నారు. త్వరలో మరో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తెదేపా కావలి పట్టణ అధ్యక్షుడు అమరా వేదగిరిగుప్తా మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారిలో 29 మందికి శస్త్రచికిత్సలు, 117 మందికి కంటి అద్దాలు అవసరం అవుతాయని వీరికి ఇదే ప్రదేశంలో త్వరలో కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 35, 38వ వార్డుల ఇన్‌ఛార్జులు కె.రమణయ్య, బి.రవీంద్ర, దామా మాల్యాద్రి, ఎం.ప్రసాద్, టి.శ్రీనివాసులు, మల్లికార్జున, బీఎంఆర్ చారిటబుల్‌ట్రస్ట్ మేనేజరు వేణుగోపాల్‌రెడ్డి, మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు భార్గవ్, రజని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చుక్కల మందు వేస్తున్న అలేఖ్య పక్కనే అమరా

తూర్పు దళితవాడలో సమస్యలు

పురిణి(అల్లూరు), న్యూస్‌టుడే : అల్లూరు మండలంలోని పురిణి పంచాయతీ పరిధిలోని తూర్పు దళితవాడలో సమస్యలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడ అంతర్గత వీధులకు అవసరం అయిన మురుగునీటి కాలువలు లేకపోవటంతో వర్షం వచ్చినప్పుడు బయటకు పోవటం లేదు. దీంతో వీధుల్లోనే నీరు నిల్వ ఉంటుంది. ప్రజలు వీధుల్లో తిరగాలంటే కష్టంగా మారింది. వీధులు బురదగా మారటంతో అసౌకర్యంగా మారింది. ఇదే ప్రాంతంలో తాగునీటి కొళాయికి సంబంధించి పైపు పగిలిపోవటంతో తాగునీటి వృథాతోపాటు అక్కడ నీటి మడుగు ఏర్పడింది. దళితవాడలో వీధి దీపాలు మరమ్మతులకు గురికావటంతో వెలగటం లేదు. మరొక వీధిలో విద్యుత్తు స్తంభం ఒకవైపు ఒరిగిపోయింది. గత రెండు సంవత్సరాలుగా విద్యుత్తు స్తంభం గురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని స్థానికులు తెలిపారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించి సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి కొళాయి వద్ద పైపు పగిలిపోవటంతో నీటి మడుగు



వీధి దుస్థితి ఇలా..

వాహనదారులు స్కేటింగ్ చేయాల్సిందే

కొండబిట్రగుంట-కొత్తూరు(బిట్రగుంట), న్యూస్‌టుడే: కొద్దిపాటి వర్షం పడిన బిలకూటక్షేత్రం కొండబిట్రగుంటకు వెళ్లే రోడ్డు చిత్తడై పోతోంది. వాహనదారులు స్కేటింగ్ చేయల్సిన పరిస్థితి ఏర్పడింది. అనుభవం లేని వారు జారి పడాల్సిందే. మంగళవారం రోజున ఈ పరిస్థితి బోగోలుకు చెందిన గిరి, సుబ్బారావులకు ఎదురై చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. బోగోలు మండలం కొత్తూరు-కొండబిట్రగుంట మధ్య రోడ్డును పరిశీలిస్తే అర్థ మవుతుంది. నీరు నిలబడే చోట, కోతకు గురైన ప్రాంతాల్లోనైనా తాత్కాలిక మరమ్మతులకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని స్థానిక పీఆర్ఏఈ శ్యాంసుందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా శాశ్వత ప్రగతికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయన్నారు. డీఈ వేణుగోపాల్‌తో కలిసి రోడ్డు వెంటనే పరిశీలించి ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక చర్యలు కూడా చేపడతామని వెల్లడించారు.



ప్రమాదకరంగా తయారైన రోడ్డు

కావలి

నేడు పురపాలక సాధారణ సమావేశం

కావలి, న్యూస్‌టుడే : కావలి పురపాలక సంఘం కార్యాలయంలో శ్రీపొట్టి శ్రీరాములు సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాధారణ సమావేశం జరుగుతుందని పుర కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. సమావేశానికి పాలక వర్గం సభ్యులు, కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. అజెండాలో ఈ సారి వైకాపా వార్డులకు అభివృద్ధి పనులు పెట్టారు.

ఆర్సీ పాలెంలో రెండో రోజు శిక్షణ

ఆర్సీపాలెం(కావలి), న్యూస్‌టుడే : కావలి మండలం ఆర్సీపాలెంలో చెత్త నుంచి సంపద తయారీకేంద్రంపై రెండో రోజు అవగాహన సదస్సు జరిగింది. బుధవారం కలిగిరి, కొండాపురం, జలదంకి, కావలి మండలాలకు చెందిన 15 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. తొలుత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మి కంపోస్టు ఎరువు తయారీ విధానం, గ్రామంలో చెత్త సేకరణ తీరును తెలుసుకున్నారు. అనంతరం సర్పంచి గుంటూరు మల్లికార్జున మాట్లాడుతూ తయారీ కేంద్రం నిర్మాణం తీరు, ఏ విధంగా నిర్వహణ చేస్తున్నామనే వివరాలను వారికి తెలియచేశారు. 15 పంచాయతీల నుంచి సగం మందే హాజరుకావడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పంచాయతీలు స్వయం సమృద్ధిగా ఆదాయాలు సమకూర్చుకోవాలని చూస్తుంటే ప్రజా ప్రతినిధులు మొక్కుబడిగా హాజరుకావడం జరుగుతోంది. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ షఫి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు

రైల్వేగేటు తెరిపించాలని వేడుకోలు

బిట్రగుంట, న్యూస్‌టుడే : బోగోలు మండల పరిధిలోని శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ ఉత్తరం ఉన్న రైల్వేగేటు కొంతకాలంగా మూతపడడంతో రెండు మండలాల మధ్య రాకపోకలకు కొంత అసౌకర్యం ఏర్పడింది. రైల్వే అధికారులు రైలు మార్గాల పటిష్ఠత పనులు చేపట్టిన కారణంగా రైల్వేగేటు మూత వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకా పనులు పూర్తికాకపోవడం వల్ల వాహనదారుల రాకపోకలు ఆగిపోయాయి. దూరమైనా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక మండలం తాళ్లూరు, పాతబిట్రగుంట, జలదంకి మండలం విజయనగరం తదితర గ్రామాల వాహనదారులు ఈ గేటు నుంచి కావలి గ్రామీణ మండలం గౌరవరం చేరుకొని కావలి పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే అధికారులు స్పందించి రైలు మార్గాల పటిష్ఠత పనులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరణ అయ్యేందుకు గేటు తెరిచేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

IN THE COURT Xth ADDITIONAL DISTRICT JUDGE: TIRUPATI

O.S.No.173 OF 2013

I.Prabhakar Reddy ..Plaintiff

Vs.

A.Subhash Chandrabose

O.Ramachandraiah

..Defendants

SUMMONS TO THE DEFENDANT No.1

A.Subhash Chandra Bose, S/o. A.Subba Reddy, residing at C/o. Srinivasulu Reddy, Gattu Palli, Chinthalapalem Village, Jaladanki Mandal, S.P.S.Nellore District.

WHEREAS the Plaintiff has instituted a Suit for specific performance against you and another, you are hereby summoned to appear in the Court in person or by a Pleader on the 7.9.2017 at 10.30 A.M. take notice that, in defaults of your appearance on the day before mentioned the Suit will be heard as exparte.

T.M.PURUSHOTHAM
Advocate for Plaintiff

తాత్కాలిక ఉద్యోగుల సమస్యలపై కృషి

హంసా రాష్ట్ర అధ్యక్షుడు యోగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న హంసా రాష్ట్ర అధ్యక్షుడు యోగేశ్వరరెడ్డి

నెల్లూరు (వైద్యం),న్యూస్‌టుడే : వైద్య, ఆరోగ్య శాఖలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు హెల్త్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) రాష్ట్ర అధ్యక్షుడు యోగేశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం జరిగిన ఆ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిహేనేళ్లుగా తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగుతున్న హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మాసిస్టులను రెగ్యులర్ చేయాలన్నారు. అతి తక్కువ జీతాలతో సేవలందిస్తున్న 108, చంద్రన్న సంచార చికిత్స సిబ్బందికి జీతాలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్, నాయకులు ప్రతాప్‌బాబు, లక్ష్మీ కుమారి, రాజ్ కుమార్ ఆచార్యులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల విజయంతో పార్టీలో నూతన ఉత్తేజం : మంత్రి సోమిరెడ్డి



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి మంత్రి సోమిరెడ్డికి అల్లీపురం వాసుల స్వాగతం

నెల్లూరు(హరనాథపురం), న్యూస్‌టుడే నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా గెలుపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లోగాని, పార్టీలో గానీ నూతన ఉత్తేజం తీసుకొచ్చింది. మూడేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పడిన కష్టం, ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్రం విడిపోవడం, రూ. 16వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధికి ఈ ఎన్నికలు అద్దం పట్టాయని రాష్ట్ర వ్యవసాయశాఖా మాత్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చారు. ఆయనకు తెదేపా నగర, గ్రామీణం, సర్వేపల్లి నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్పొరేటర్‌లు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలికారు. స్టేషన్ ఆవరణంలోనే పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. పూల మాలలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సోమిరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీ వైకాపా ప్రవర్తించిన తీరుకూడా అక్కడి ప్రజలు, ఓటర్లు తెలుగుదేశం పార్టీ మంచి మెజార్టీతో గెలవాలని కోరుకొని తమ ఓటుతో సమాధానం చెప్పారన్నారు. కాకినాడ ఎన్నికల్లోనూ తెలుగుదేశం గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ మోహన్‌రెడ్డి చెప్పినట్లు నంద్యాల ఎన్నికల ఫలితాలు మూడేళ్ల తెదేపా పరిపాలనకు రెఫరెండం అని చెప్పారని, ఆయన సవాల్‌ను మేము స్వీకరించామని, ఆయన అన్నట్లే 2019 ఎన్నికలు ఏ విధంగా ఉండబోతున్నాయో ప్రజలు ఇప్పుడే తీర్పిచ్చారని మంత్రి పేర్కొన్నారు. నంద్యాలలో తెదేపా విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిని, తెదేపాను గెలిపించిన ప్రజలకు అభినందనలు తెలియజేశారు. కార్పొరేటర్‌లు దాసరి రాజేష్, మేకల రామ్మూర్తి, సత్యనాగేశ్వరరావు, పోతూరు శైలజ, నాయకులు మున్వర్‌బాషా, ఒట్టూరు సంపత్‌రాజు, సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు మోపూరు శ్రీనివాసులురెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి బిడ్డకూ ఎంఆర్ టీకా వేయాలి

వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌డీ షాలినీదేవి



మాట్లాడుతున్న ఆర్‌డీ షాలినీదేవి

నెల్లూరు (వైద్యం),న్యూస్‌టుడే : మీజెల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌ను ప్రతీ బిడ్డకు అందించేలా కృషి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు షాలినీ దేవి సూచించారు. నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఆర్‌డీ వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 నెలల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులందరికీ వచ్చే నెల 8వ తేదీలోపు ఎంఆర్ వ్యాక్సిన్‌ను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్టీఆర్ ఉచిత పరీక్షలు, ఈ ఔషధి, టెలీ రేడియాలజీ, 102 కాల్ సెంటర్ పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీ, ఉప కేంద్రాల్లో.. ఏఎన్‌ఎంవోఎల్, ఎంఎంహెచ్‌సీ కార్యక్రమాలపై అవగాహన కల్పించి.. సిబ్బందికి అందజేసిన ట్యాబ్‌లలో వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 24/7 ఆసుపత్రుల్లో కాన్పులను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా కాన్పులను ఆన్‌లైన్లో పొందు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వరసుందరం, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే నవరత్నాల అమలు : మేకపాటి



మాట్లాడుతున్న ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు(ఇరిగేషన్)న్యూస్‌టుడే: ప్రజల కోసం వైకాపా రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి నవరత్నాలు అధికారంలోకి రాగానే అమలు చేస్తారని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం నవరత్నాల కార్యక్రమం నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన నెల్లూరులో కల్యాణ మండంలో నిర్వహించారు. ఎంపీ ముఖ్యఅతిథిగా కార్యక్రమంలో పాల్గొని విజయశంఖారావం, నవరత్నాలు వంటి కార్యక్రమాలు పార్టీ అభివృద్ధి కోసం ప్రారంభించారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం మూడు సంవత్సరాలు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఎంపీ విమర్శించారు. నంద్యాల ఎన్నికలో డబ్బు వెదజల్లి తెదేపా అభ్యర్థిని గెలిపించుకున్నారన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు పోలింగ్ బూత్ కమిటీతో త్వరలో జగన్ సమావేశం అవుతారని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉపఎన్నికలో గెలవడం కాదని 2004 ఎన్నికల తరహాలో రానున్న ఎన్నికల్లో తెదేపాకు అపజయం తప్పదని అన్నారు. పార్టీలో అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేటర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెన్నమ్మపై పెత్తం దారులు!



ఇసుక తరలింపుతో దెబ్బతిన్న పెన్నా పొర్లుకట్ట

28 చోట్ల ప్రభుత్వ అనుమతులు
పరివాహకంలో అన్ని చోట్లా
దొడ్డిదారిన తవ్వకాలు
ఉచితం మాటున ఇసుక దందా
అమలు కాని ప్రభుత్వ ధరలు

నెల్లూరు (ఇరిగేషన్), వెంకటాచలం - న్యూస్‌టుడే

ప్రభుత్వం సామాన్యులకు ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చినప్పటికీ జిల్లాలో చాలా చోట్ల అమలుకు నోచుకోవటం లేదు. భూగర్భగనుల శాఖ అధికారుల లెక్కల ప్రకారం 28 ప్రాంతాలను మాత్రమే ఇసుకను తరలిచేందుకు అనుమతిచ్చారు. ఈరీచ్‌లలో ఎటువంటి పన్ను చెల్లించకుండానే గృహనిర్మాణ అవసరాలకు ఇసుకను ఉపయోగించుకోవచ్చు. ఈ విధానంలో అధికారుల ఉదాశీన వైఖరి, పర్యవేక్షణ లోపంతో సామాన్యులకు ఎక్కడా ఉచితంగా ఇసుక నిర్ణయించిన ధరకు లభించటంలేదు. ఒక యూనిట్ ఇసుక ధర పది కిలోమీటర్లకు రూ. 900 (లోడింగ్ రూ. 300లతో కలిపి) ప్రభుత్వం ధర నిర్ణయించింది. జిల్లా కేంద్రంలోనే రూ. 1,300 నుంచి రూ. 1,600 వరకు బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఉచిత ఇసుక విధానం 2016లో తీసుకొచ్చినా నిబంధనల మేరకు రవాణా చేసే వాహనాల ఛార్జీల పట్టిక అమలుకు నోచుకోవటం లేదు. లోడింగ్ ఛార్జీలు ప్రభుత్వం రూ. 300 నిర్ణయించినప్పటికీ కూలీలకు కేవలం రూ. 200 మాత్రమే చెల్లించి వినియోగదారుల వద్ద భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లా కేంద్రంలోనే సుమారు 500 ట్రాక్టర్లు పెన్నా పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇటీవల పోలీసు ఉత్తర్వులు కఠినతరం కావటం, నగరంలో నిషేధాజ్ఞలు విధించటంతో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ట్రాక్టర్ల రాకపోకలు తీవ్రతరమయ్యాయి.

కొల్లకొడుతున్నారు

పల్లెపాడు నుంచి అనంతసాగరం వరకు ఉన్న పెన్నా పరివాహక ప్రాంతాల్లో పొర్లు కట్టలను సైతం కొల్లగొడుతున్నారు. అనుమతులున్న రీచ్‌ల్లో మాత్రమే ఇసుక తరలింపు చేయాలన్న ఆదేశాలున్నా కొన్ని గ్రామాల సమీపంలో కట్టలను తొలగించేశారు. ఇసుక తరలింపునకు అనుకూలంగా ఉన్న కోడూరుపాడు, పల్లెపాడు, వేగూరు, విడవలూరు, మినగల్లు, కాగులపాడు, జొన్నవాడ, అప్పరావుపాళెం పరిసర ప్రాంతాల్లో పొర్లు కట్టలను తొలగించి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఒకే ప్రాంతంలో ఇసుకను తరలిస్తుండటంతో పది నుంచి 15 అడుగుల వరకు గోతులు ఏర్పడుతున్నాయి.

నదిలో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేయటంపై నియంత్రణ లేకపోవటంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. జిల్లా కేంద్రంలోనే ఇటీవల తాగునీటి ఏద్దడి ప్రతి ఇంట్లో కొత్త బోర్లు వేయించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

పక్కరాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల్లో మంచి గిరాకీ ఉండటంతో అక్రమార్కులు ఇసుక తరలింపునకు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. సిలికా మాటున తరలించి రూ. లక్షలు గడిస్తున్నారు. ఇటీవల నాయుడుపేట సమీపంలో జరిగిన ఒక ప్రమాదంలో ఈఘటన వెలుగు చూసింది. పోలీసులు సైతం నివ్వెరపోయారు.

వెంకటాచలానికి ఇసుక తరలింపు చేస్తున్న పొట్టేపాళెం నుంచి 14 కిలోమీటర్ల దూరం ఉంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇక్కడికి ట్రాక్టర్ ఇసుక తరలించాలంటే రూ. 1,400 చెల్లించాల్సి ఉంది. తరలింపు దారులు సిండికేట్‌గా మారి రూ. 1,800 నుంచి రూ. 2,000 వరకు వసూలు చేస్తున్నారు. గతంలో రూ. 1700లకు తరలించగా నూతన విధానంలో ధర పెరగటం విశేషం.

పొదలకూరు మండలం మహ్మదాపురం, ఇరువూరు, సూరాయపాళెం గ్రామాలు ఇసుక తరలింపునకు అనుకూలం. ఇరువూరులో మాత్రం తరలింపునకు అనుమతి ఇచ్చారు. అక్రమార్కులు ఇష్టరీతిలో తవ్వకాలు జరపటం, కట్టలు ధ్వంసం చేయటం, ప్రత్యేక దారులు వేయటం, మీటర్ల కొద్ది తవ్వకాలు జరుపుతున్నారు. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో స్థానికులు తవ్వకాలను అడ్డుకున్నారు.



బుచ్చి మీదుగా అధికలోడుతో వెళుతున్న ఇసుక ట్రాక్టరు

అంతా ఇష్టారాజ్యమే

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే

బుచ్చిరెడ్డిపాళెంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. అధికారికంగా మినగల్లు రీచ్ ఉంది. నిబంధనలకు విరుద్ధంగా పెన్నా తీరం ఆనుకొని ఉన్న జొన్నవాడ,కాళయకాగొల్లు,దామరమడుగు , పల్లెపాళెం గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. కాళయకాగొల్లు పంచాయతీ భాపనపాడు రీచ్ నుంచి పెద్దసంఖ్యలో ఇసుకను ట్రాక్టర్లతో ఒకచోటకు చేర్చి అక్కడి నుంచి లారీలకు ఎత్తి చైన్నై,ఇతర దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదేవిధంగా విడవలూరు మండలంలో ఇసుక రీచ్‌కు అనుమతి లేదు. ముదివర్తి,ఊటుకూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండల కేంద్రం నుంచి వాహనాలు వెళుతున్నప్పటికీ అటు పోలీసులు,ఇటు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ప్రమాదకరంగా తవ్వకాలు

సంగం, న్యూస్‌టుడే

సంగం మండలంలో ప్రభుత్వం పడమటిపాళెం, కోలగట్ల గ్రామాల వద్ద పెన్నానది నుంచి ఇసుకను తరలించేందుకు రెండు రేవులను అనుమతించింది. ప్రస్తుతం కోలగట్ల గ్రామం నుంచి ఇసుకను తరలించడం లేదు. గ్రామస్థులు భూగర్భజలాలు అడుగంటుతున్నాయని భయాందోళనకు గురయ్యారు. రేవును మూసివేశారు. పడమటిపాళెం రేవు నుంచి మాత్రం పథకం ప్రకారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. సంగంలో రెండు రేవులు అనధికారికంగాఉన్నాయి. ఒక రేవు పొర్లుకట్ట సమీపంలో ఉంది.



నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు



వేగూరు సుబ్బారెడ్డిపురంలో పెన్నానదిలోకి వేసిన అనధికారబాట

పగలు, రాత్రి తేడా లేదు

కోవూరు గ్రామీణం, న్యూస్‌టుడే

కోవూరు మండలం వేగూరు సుబ్బారెడ్డిపురం,జమ్మిపాళెం గ్రామాల్లో దొడ్డిదారి ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వీటిల్లో రాత్రి,పగలు తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక నాణ్యతగా ఉండడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీనిని జిల్లా నలుమూలలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. వేగూరులో అధికంగా ఇసుక తవ్వకాల వలన భూగర్భ జలాలు అడుగంటాయి. పలుమార్లు అధికారులు హెచ్చరించినా కృష్ణపట్నం పోర్టు తదితర ప్రాంతాలకు తరలిస్తునే ఉన్నారు.

సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి) చేశారు. బెంగళూరులోని శాటిలైట్ సెంటర్ నుంచి ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహం షార్‌కు చేరుకున్న తర్వాత ఇక్కడికి ఉపగ్రహ డైరెక్టర్ రామనాథన్ వచ్చి తన టీమ్ సభ్యులతో వివిధ తనిఖీలు, ఇంధనం ఫిల్లింగ్, తదితర చర్యలు చేపట్టి, రాకెట్ శిఖరభాగాన అమర్చారు. వీటిన్నింటినీ ఎప్పటికప్పుడు షార్ సంచాలకులు కున్హికృష్ణన్ పరిశీలిస్తూ శాస్త్రవేత్తలను, ఇతర ఇంజినీర్లను, ఉద్యోగులను సమన్వయం చేసుకుని ముందుకు కదలి, అనుకున్న సమయానికి రాకెట్‌ను ప్రయోగానికి సిద్ధం చేశారు. అదే తరహాలో శనివారం వ్యాబ్ నుంచి రాకెట్‌ను రెండో ప్రయోగవేదికకు తీసుకురావల్సి ఉండగా వాతావరణ శాఖ సూచనలతో నిలిపేశారు. మరుసటి రోజు ఆదివారం వ్యాబ్ నుంచి వాహనాన్ని రెండో ప్రయోగ వేదికకు తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించారు.

షార్‌కు చేరుకున్న ఇస్రో అధిపతి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అధిపతి(ఇస్రో) ఎ.ఎస్.కిరణ్‌కుమార్ బుధవారం రాత్రి 8.15 గంటలకు షార్‌కు చేరుకున్నారు. ఆయన గురువారం రెండో ప్రయోగ వేదికవద్దకెళ్లి పీఎస్ఎల్‌వీని పరిశీలిస్తారు. అక్కడ ఆనవాయితీ ప్రకారం డైరెక్టర్‌తో కలిసి ఫొటో దిగుతారు. అక్కడి నుంచి షార్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, మిషన్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకుని కౌంట్‌డౌన్ ప్రక్రియను తెలుసుకుంటారు. శాస్త్రవేత్తలతో సమావేశం కానున్నారు. ప్రయోగం అయిన తర్వాత రాత్రికి చెన్నైకు బయలుదేరి వెళ్లనున్నారు.

చేపలవేట నిషిద్ధం.. : షార్ నుంచి గురువారం రాకెట్ ప్రయోగం ఉన్న దృష్ట్యా సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు సముద్రంలో చేపల వేట నిషేధించారు. షార్‌కు 15 నాటికల్ మైళ్లు(28 కిలోమీటర్లు) వరకు చేపల వేట చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వానికి ముందుస్తు సమాచారం అందించారు. పులికాట్ లైట్ హౌస్, ఆర్మగన్ లైట్ హౌస్ ప్రాంతాల్లోనూ చేపల వేట వద్దని సూచించారు.

కొనసాగుతున్న కూంబింగ్ : రాకెట్ ప్రయోగం దృష్ట్యా షార్ అడవులు , తీర ప్రాంత గ్రామాల్లో కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. తీర ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించారు. షార్ మొదటి, రెండు గేట్ల వద్ద సాధారణ రోజుల కంటే భద్రతదళాల సంఖ్యను పెంచారు. షార్‌కు వచ్చే పోయే వాహనాలను అటకానితిప్ప వద్ద తనిఖీ చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా తమిళనాడు నుంచే కాక, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అగ్నిమాపకయంత్రాలను పిలిపించారు.





విద్యార్థులకు ఆపన్నహస్తం

పేదల అభ్యున్నతే లక్ష్యంగా సేవలు

ఏటా రూ. 10 కోట్ల విలువైన సామగ్రి, సమ దుస్తుల పంపిణీ

కోట పంచాయతీ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీలోని 40 మంది విద్యార్థులకు ప్రతి ఏడాది విద్యా సామగ్రి, సమ దుస్తులను నవచైతన్య యువజన సంఘం దాతల దాతృత్వంతో అందిస్తారు. ఇంక పలువురు దాతలు ముందుకు వచ్చి పోటీ పడి మరి అదనపు వసతులు కల్పిస్తున్నారు.

చిట్టమూరు మండలం ఎల్లసిరిలోని పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు కేజీపీ ఫౌండేషను దాతృత్వంతో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అరవపాలెంలోని ఉన్నత పాఠశాలలో పోషకాహారం అందిస్తున్నారు.

గూడూరులోని 86 పాఠశాలలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఏటా రూ. 4 లక్షల విలువైన విద్యా సామగ్రి అందజేస్తున్నారు. పలు అదనపు వసతులు కల్పిస్తున్నారు.అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం మిన్న అన్నారు పెద్దలు. పేద విద్యార్థులకు కనీస వసతులు లేక విద్యపై మక్కువ చూపలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారు. ప్రభుత్వం అందించే వసతులు విద్యార్థులకు సరిపోవడం లేదు. విద్యార్థుల పరిస్థితులు తెలుసుకున్న దాతలు, స్వచ్ఛంద సంస్థలు, యువ దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నారు. అందులో భాగంగా విద్యాసామగ్రితోపాటు సమ దుస్తులు, నీటి వసతులు, పోషకాహారం పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



వాకాడు మండలంలో విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

న్యూస్‌టుడే, కోట

జిల్లాలోని 46 మండలాల్లోని 1,000 పాఠశాలల్లోని లక్ష మంది పేద విద్యార్థులకు ప్రతి ఏడాది రూ. 10 కోట్లు విలువైన విద్యా సామగ్రి, సమ దుస్తులు, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు దాతలు ఇచ్చిన వసతులు పొంది క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధిస్తున్నారు.

దాతలు అందించిన దాతృత్వానికి ఫలితాలు అందిస్తున్నారు. గూడూరు, కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 25 స్వచ్ఛంద సంస్థలు, 50 మంది దాతలు ప్రతి ఏడాది 100 పాఠశాలల్లోని 6 వేల మంది విద్యార్థులకు రూ. కోటి విలువైన విద్యా సామగ్రి, సమ దుస్తులు ఇతర వసతులు కల్పిస్తున్నారు. అందులో భాగంగా కోట మండలంలోని 25 పాఠశాలల్లోని 2 వేల మంది విద్యార్థులకు రూ. 10 లక్షలు విలువైన విద్యా సామగ్రి, సమ దుస్తులు అందించారు. గూడూరులోని 86 పాఠశాలల్లోని 6వేలు మంది విద్యార్థులకు 10 స్వచ్ఛంద సంస్థలు, 15 మంది దాతలు ముందుకు వచ్చి రూ. 20 లక్షల విలువైన సామగ్రి అందిస్తున్నారు. వాకాడులోని 25 పాఠశాలలకు 5 స్వచ్ఛంద సంస్థలు, 10 మంది దాతలు ముందుకు వచ్చి 2 వేలు మంది విద్యార్థులకు రూ. 10 లక్షల విలువైన సామగ్రి, సమ దుస్తులను అందిస్తున్నారు. చిల్లకూరు మండలంలోని 30 పాఠశాలల్లో 3 స్వచ్ఛంద సంస్థలు, 15 మంది దాతలు 2 వేలు మంది విద్యార్థులకు రూ. 10 లక్షలతో ప్రతి ఏడాది విద్యా సామగ్రి, సమ దుస్తులు అందిస్తున్నారు. చిట్టమూరు మండలంలోని 25 పాఠశాలల్లో రెండు స్వచ్ఛంద సంస్థలు, 10 మంది దాతలు దాతృత్వంతో 3 వేలు మంది విద్యార్థులకు రూ. 15 లక్షలు విలువైన విద్యా సామగ్రి, సమ దుస్తులు అందజేస్తున్నారు. అదే విధంగా నెల్లూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు, ఉదయగిరిల్లోను స్వచ్ఛంద సంస్థలు దాతలు దాతృత్వంతో విద్యా సామగ్రి, సమ దుస్తులు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

సకల దేవాలయాలకు నెలవు

హరిత వనం కనువిందు

న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

నాయుడుపేట మండలంలోని స్వర్ణముఖినది ఒడ్డు పలు ఆలయాలకు నిలయంగా మారుతోంది. ప్రధానంగా తిమ్మాజకండ్రిగ ప్రసిద్ధ దేవతారూపాలు సందర్శనీయంగా ఉంటోంది. చిగురుపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు అనుకుని నది పక్కన పంచాయతీ పోరంబోకు, దేవాదాయ శాఖకు చెందిన భూములు ఉన్నాయి. ఈ భూముల్లో పదేళ్ల కిందట స్థానిక చిగురుపాడు వాసి పద్మనాభయ్య అభయాను గ్రహ వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయం సుమారుగా ఏడు ఎకరాల విస్తీర్ణంలో రూ. 7.2 కోట్లతో 2007సం వత్సరంలో ఆలయానికి భూమి పూజ చేశారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఒక్కో ఒక్కో పని కేటాయించుకుని ఆలయం నిర్మాణం చేపట్టారు. భారీ మొత్తంతో నిర్మించిన దేవాలయంలో సుందరమైన అభయాను గ్రహ వెంకటేశ్వరుని అమర్చి పనులు పూర్తి చేశారు. సుందర ఆలయాన్ని ఆలయం పరిసర ప్రాంతాలు [illegible] ఉండేలా చుట్టూ [illegible] అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. కోట్ల రూపాయలతో చేపట్టే పనిని దాతల సహకారంతోనే [illegible] దంగా పనులు వద్దే ఉండి చెయిస్తున్నారు. ఈ ప్రాంతానికి రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకునేలా [illegible] నిర్మాణం జరుగుతోంది. ఈ ఆలయం పక్కనే ఏడాది నుంచి శివాలయం నిర్మాణం జరుగుతోంది. దీన్ని రూ. 13 లక్షల నిధులతో చేపట్టారు. ఇది కూడా భక్తుల చొరవతోనే జరుగుతోంది. పనులు పూర్తియి కుంభాభిషేకం జరగనుంది. ఆలయం చుట్టూ మాడ వీధులు ఏర్పరిచారు. శ్రీవారి పుష్పవనంలో పచ్చని మొక్కలు పెరుగుతున్నాయి. పెద్దపెద్ద చెట్లు దర్శనమిస్తున్నాయి. పలు రకాల పూలతో సుందరంగా మారుతోంది. ఇక గోశాల నడుపుతున్నారు. శ్రీఅభయానుగ్రహ వెంకటేశ్వరస్వామి ముందుభాగంలో ఇటీవల కొన్ని రోజుల కిందట శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం కుంభాభిషేకం జరిగింది. దీన్ని సుందరంగా నిర్మించారు. మూడేళ్ల నుంచి ఇక్కడ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవతామూర్తుల ఆలయాలను రూ. 30 లక్షలతో నిర్మించారు. ఇక్కడ ప్రతినిత్యం హోమాలు, పూజలు జరుగుతున్నాయి. ఇక వీటి వెనుక భాగంలో జగద్గురువు శంకరాచార్యుల ఆలయం నిర్మాణం జరుగుతోంది. ఇక్కడే దత్తాత్రేయ స్వామి ఆలయం, త్యాగరాజస్వామి ఆలయాల పనులు జరుగుతున్నాయి. ఇలా పలు ఆలయాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా వృద్ధి జరగనుంది.



స్వర్ణముఖినది ఒడ్డున నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయం

స్వర్ణముఖి నదీ తీరాన, బంగారువర్ణంలోని ఇసుక రేణువులు నడుమ, ఎత్తుపల్లాల ఇసుక మేటల మధ్య, ప్రశాంత వాతావరణంలో, ఆహ్లాదకరమైన ఆవరణలో, పచ్చని చెట్లు, సుందరంగా ఉండే పుష్పాలు, మొక్కలు మధ్యలో ఆలయాలు విలసిల్లుతున్నాయి. ఆధ్యాత్మిక చింతనకు అద్భుత ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. ఒకవైపు దేవుని సన్నిధిలో పూజలు, మరో వైపు ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఇంకో వైపు గురువుల ప్రసంగాలతో బోధనలు, ప్రతినిత్యం హోమాలు, అన్నదానాలు జరుగుతున్నాయి. ఒకేచోట పలు ఆలయాలకు నిలయంగా ఈ ప్రాంతం ప్రత్యేకత చాటుకుంటోంది. ఇది దేవాలయాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. కోట్లాది రూపాయలతో ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

ధ్యాన కేంద్రం

ఆలయాలకు రోడ్డుకు అవతలివైపు శ్రీకాళహస్తీశ్వర పిరమిడ్ ధ్యాన కేంద్రం ఉంది. ఐదారేళ్లుగా ఈ కేంద్రానికి నాయుడుపేట చుట్టు పక్కలప్రాంతాల ప్రజలు చేరుకుని ఇక్కడి పిరమిడ్‌లో కూర్చుని ధ్యానం చేస్తున్నారు. గ్రంథాలయంలో పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకుంటున్నారు. పచ్చని చెట్లు, పూల మొక్కలు నడుమ చల్లని గాలులతో మంచి వాతావరణంలో మానసిక ప్రశాంతత పొందుతున్నారు. ఎప్పుడూ ధ్యానులతో నిండుతోంది. చిన్నారులు, పెద్దలు, వృద్ధులు, మహిళలు ధ్యానం చేస్తున్నారు. ఈ కేంద్రంలో బుద్ధుడి, శివుడు విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఇక్కడ ప్రతిరోజూ సాయంత్రం రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలకు అల్పాహారం ఇస్తున్నారు. దత్తాత్రేయ భక్త బృందం ప్రతివారం అన్నదానం చేస్తోంది. దాతలు దాతృత్వంతో అటు ఆధ్యాత్మికత, ఇటు ధ్యాన కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇక్కడే వృద్ధులకు ఆశ్రమం నిర్వహిస్తున్నారు. నదిలో నీరు పారే వేళ తీరాన ఆలయాలు భక్తులతో కళకళలాడనున్నాయి.





ధ్యానం చేసుకునేందుకు వీలుగా పిరమిడ్.. ఆకట్టుకుంటున్న పచ్చదనం

ఉపకారం.. బహుమానం

జిల్లాలో 386 కళాశాలల్లో విద్యార్థుల నమోదు

నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే జమ

'జ్ఞానభూమి' వెబ్‌సైట్‌తో అక్రమాలకు చెక్

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత చదువులు చదవాలని కోరిక ఉన్నా ఆర్థిక స్థోమత లేక చదువులు అర్థాంతరంగా ఆగకుండా ఉండేందుకు ప్రభుత్వం వివిధ స్థాయిల్లో ఉపకార వేతనాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. దీని ద్వారా లబ్ధి పొందినవారు జీవితంలో స్థిరపడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఉపకార వేతనాల్లో జరుగుతున్న అక్రమాలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలను చేపట్టింది. అందులో భాగంగానే అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 'జ్ఞానభూమి' వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా విద్యార్థులు ఉపకార వేతనం పొందటం మరింత సులభతరం కానుంది. విద్యార్థులు సంబంధిత విద్యాసంస్థలో చేరినప్పుడే తమ విద్యార్హత, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు, ఆధార్ కార్డు నకళ్లను, చరవాణి నంబరును అందించాల్సి ఉంటుంది. వీటిని 'జ్ఞాన భూమి' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయటం జరుగుతోంది. అలా చేసిన వెంటనే విద్యార్థుల చరవాణిలకు ఐడీ పాస్ వార్డ్ వస్తాయి. వీటి ఆధారంగా వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి అందులోని వివరాలు సరిచూసుకుని విద్యార్థి ధ్రువీకరించాల్సి ఉంటుంది. అన్ని సక్రమంగా ఉంటే బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం ఉపకార వేతనాలను జమ చేస్తుంది.



ఆధునిక పద్ధతిలో హాజరు వేస్తున్న విద్యార్థిని

తప్పక తరగతులకు హాజరుకావాలి

ఉపకార వేతనాలు పొందాలనుకునే అర్హులైన విద్యార్థులు విధిగా తరగతులకు హాజరు కావాల్సి ఉంది. నిత్యం బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరును నమోదు చేయాలి. గత ఏడాది ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ప్రతీ 100 మంది విద్యార్థులకు ఒక బయోమెట్రిక్ యంత్రం, 250 మంది విద్యార్థులకు ఒక ఐరిష్ యంత్రాన్ని విద్యా సంస్థల్లో ఉంచాలని ఏప్రిల్ నెలలో ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ యంత్రాలు ఏర్పాటుకు ఈ నెల 31కి తుది గడువు విధించారు. ఈ తతంగాన్ని గత విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించుకున్నా కొన్ని కారణాలు దృశ్య అమలు చేయలేకపోయారు. ఇప్పుడు విద్యార్థుల హాజరు ఉపకార వేతనాలతో ముడిపెట్టడంతో అమలు చేయక తప్పని పరిస్థితి.

ప్రధానాచార్యుడిదే బాధ్యత

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ, దివ్యాంగులైన వారిలో అర్హులైన పేద విద్యార్థులతో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయించే బాధ్యతను సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌దే. సంక్షేమ శాఖ అధికారుల తనిఖీలో అనర్హులను ఉపకార వేతనాలకు ప్రతిపాదించినట్లు నిరూపితం అయితే ప్రిన్సిపల్లపైనే చర్యలు తీసుకుంటారు. బయోమెట్రిక్ విధానంలో తీసుకున్న హాజరు వివరాలను ప్రతినెలా సంబంధిత శాఖలకు ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉంటుంది. సంబంధిత శాఖల వారు వీటిని పరిశీలించి ప్రభుత్వ ఖజానాకు పంపుతారు. దీనికోసం డిజిటల్ సంతకాలను వినియోగిస్తారు. ఈ విధానం వల్ల ఉపకార వేతనాల దరఖాస్తు ప్రక్రియ వేగవంతమై సకాలంలో నిధులు మంజూరు అవుతాయని సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు.

అందించే ఉపకార వేతనం

ప్రభుత్వ వసతి గృహంలో ఉండే వారికి నెలకు రూ. 520, మేనేజ్‌మెంట్ వసతి గృహంలో ఉండేవారికి రూ. 325, డే స్కాలర్‌కు రూ. 240 చొప్పున పది నెలలు పాటు ఉపకార వేతనం విద్యార్థులకు అందిస్తారు.

శాశ్వత గుర్తింపు సంఖ్య కేటాయింపు

కళాశాలలు 'జ్ఞానభూమి' వెబ్ సైట్‌లో తమ వివరాలు, గుర్తింపు సమాచారాన్ని నమోదు చేయాలి. కళాశాలల్లో పని చేసే అధ్యాపకులు, ఉద్యోగులతోపాటు, విద్యార్థుల వివరాలను పొందుపరచాలి. సీనియర్ విద్యార్థులతోపాటు ఆయా కోర్సుల్లో కొత్తగా చేరే విద్యార్థుల ఫొటోలు భద్రపరచుకోవాలి. విద్యార్థి ఆధార్ సంఖ్యను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాలి. ఆదాయ, కుల, ధ్రువీకరణ పత్రాల వివరాలు ఉపకార వేతన దరఖాస్తులోనింపాలి. సంబంధిత విద్యార్థి చరవాణి సంక్షిప్త సందేశం ద్వారా ఓటీఎంఎస్ (వన్ టైం మెట్రిక్ స్కాలర్‌షిప్) శాశ్వత గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఇంటర్‌లో కేటాయించిన ఈ సంఖ్య భవిష్యత్తులో డిగ్రీ, ఆపై చదువుల వరకు కొనసాగుతుంది. విద్యార్థి నెలలో కళాశాల పని దినాల్లో 75% హాజరు ఉంటేనే ఉపకార వేతనం మంజూరు అవుతుంది.

ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనాలను వారికి నేరుగా అందించేందుకు 'జ్ఞానభూమి' వెబ్ సైట్ ద్వారా ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తుంది. జిల్లాలో 386 వివిధ కళాశాలలు ఉండగా వాటిలో ఈ ఏడాదికి రెన్యూవల్ చేసుకోవాల్సిన విద్యార్థులు ఇప్పటి వరకు 52,216 మంది విద్యార్థులు రెన్యూవల్ చేసుకోగా, 58, 886 మంది విద్యార్థులు రెన్యూవల్ చేసుకోలేదు. కొత్తగా కళాశాలల్లో చేరిన విద్యార్థులు 28,543 మంది ఈ 'జ్ఞానభూమిలో' వారి వివరాలను నమోదు చేసుకోగా, 37,239 మంది విద్యార్థులు నమోదు చేసుకోవాల్సి ఉంది.



ప్రభుత్వం రూపొందించిన జ్ఞానభూమి వెబ్‌సైట్

పూర్తి బాధ్యత ప్రిన్సిపల్‌దే..

ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బాబుజాకబ్

విద్యార్థుల ఉపకార వేతనాలకోసం వారి వివరాలను సేకరించి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ 'జ్ఞానభూమి' వెబ్ సైట్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షలమంది విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. జిల్లాలో ఇప్పటికి వరకు 50% నమోదు జరిగింది. అన్ని కళాశాలలు బయోమెట్రిక్ పరికరాలను సమకూర్చుకొని వాటి ద్వారా హాజరు చేపట్టాలి.

నవ యువ శోధకులు



న్యూస్‌టుడే, గూడూరుపట్టణం

నేటి తరం విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా శాస్త్రసాంకేతిక రంగంలో వస్తున్న పరిజ్ఞానాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొంటే భవిష్యత్తుతరంలో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు పునాదులు పడతాయి. విద్యార్థులు సమయం వృథా చేయకుండా వివిధ రంగాలలో ప్రజలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం కలిగించే విధంగా ఆలోచన చేశారు. అనుకొన్నదే తడవుగా కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు ప్రోత్సాహంతో ఆదిశంకరా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు విభిన్న ఆలోచనలతో నూతన ప్రయోగాలను రూపొందించారు. శాస్త్రవేత్తలు సైతం ఆలోచిస్తున్నారు. 'ఈనాడు-ఈటీవీ' సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ప్రజ్ఞ పాఠవాలను పరిమిత సమయంలోనే పదును పెట్టి నవ పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. తాము రూపొందించిన పరికరాలు ప్రజలకే ఏ మేరకు ఉపకరిస్తాయో కూడా భావవ్యక్తీకరణ ద్వారా వెల్లడించారు. యువత నిర్వహించిన పరిశోధనల ప్రదర్శనలోని అంశాలన్నీ ఆదర్శవంతంగా ఉన్నాయి. పలు నమూనాలు ఆలోచింపచేసే విధంగా ఉన్నాయి. వాటి పనితీరుపై 'న్యూస్‌టుడే' కథనం.



లోడ్ ఇంజిన్ ప్రయోగం చేసిన రవితేజ, ప్రసాద్

దొంగతనాలను నివారించే సాధనం

సామర్థ్యం కనుగొనే యంత్రానికి ఇంజినీరింగ్ విద్యార్థులు ఊపిరిపోశారు. గూడూరులోని ఆదిశంకరా ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, ఈసీఈ చదువుతున్న రవితేజ, ప్రసాద్ రూపొందించిన యంత్రం ఆదర్శవంతంగా ఉంటోంది. లోడ్ ఇంజిన్ ప్రయోగంతో అధిక బరువు కనుగొనేందుకు ఎంతో ఉపయోగకరమైంది.. అధిక లోడ్‌తో వెళ్తున్న లారీ బరువును మార్గ మధ్యంలో కనుగొనడం, లారీ ఓనర్ మొబైల్ నెంబర్‌కు మెసేజ్ వెళ్లే విధంగా ఈలోడ్ ఇంజిన్ విధానం రూపొందించడం జరిగింది. ఏదైనా వాహనంలోని వస్తువులను, దొంగతనానికి గురికాకుండా ఇది ఎంతో ఉపయోగకరం. లారీలలో డ్రైవర్లు అదనంగా ప్రయాణికులను ఎక్కించుకొన్న వెంటనే లారీ ఓనర్‌కు తెలిసే విధంగా లోడ్ ఇంజిన్ ప్రయోగం ఉపయోగపడుతుంది.

ఆక్వాసాగులో విద్యుత్తు ఆదా

కళాశాలలో చదువుతున్న మెకానికల్, ఈఈఈ విద్యార్థులు అజయ్, వెంకటేష్, సతీష్ తదితరులు తక్కువ ఖర్చుతో ఆక్వా సాగులో రైతులు విద్యుత్తు ఉత్పత్తిని ఆదా చేయడంపై భిన్న ఆలోచనలతో రూపొందించారు. క్షేత్ర స్థాయిలో రైతులు పడుతున్న అవస్థలను పరిశీలించి కళాశాలలో యాజమాన్యం సాయంతో రెన్యుబల్(పునరుత్పాదక)ఎనర్జీ ఏరియేటర్ వల్ల రొయ్యల, చేపలు రైతులు విద్యుత్తు ఆదా చేయడంలో ఎంతో ఉపయోగకరం. ఇది కేవలం 48 వాల్ట్స్ విద్యుత్తుతో పని చేస్తుంది. తక్కువ విద్యుత్తు ఉపయోగించుకొని పనిచేసే ఈ పరికరలం రొయ్యల గుంతల వద్ద రైతులకు ఇది ఆదాయం చేకూర్చుతుంది. ఇది సోలార్‌పై నడుస్తుంది. విండ్ ఎనర్జీతో నడుస్తుంది. జనరేటర్ సహాయంతో కూడా నడుస్తుంది. పవర్ 3.75 టైమ్స్ తక్కువ ఎనర్జీతో నడుస్తుంది.



రెన్యూబల్ ఎనర్జీ ఏరియేటర్ కనుగొన్న అజయ్, వెంకటేష్, సతీష్



కూలర్ రూపొందించిన వంశీ, లావణ్య, రాజ్యలక్ష్మి

కూలర్ మరమ్మతుకాకుండా చెక్

కూలర్ తరచూ మరమ్మతుకు గురికాకుండా శాశ్వితంగా తీసుకోవాల్సిన విధానాన్ని ఆలోచించి ప్రయోగానికి శ్రీకారం చుట్టి విజయవంతం అయ్యారు మెకానికల్, ఈఈఈ విద్యార్థులు వంశీ, లావణ్య, రాజ్యలక్ష్మి తదితరులు. గదిలో ఏదో విధంగా స్టాండ్ ఎలోన్, వాల్‌మౌంట్‌లు గది చల్లబరిచే విధంగా చూపే విధానం ఎ-కూలర్ సాధ్యం. ఇది ఎయిర్ కూలర్ కంటే ఎయిర్ కండీషనర్, కంటే ఎక్కువ చల్లధనాన్ని ఇస్తుంది. దీని డిజైన్ మార్పు చేయడం వల్ల దీనికి ఇండస్ట్రీలో కూడా ఉపయోగించుకోవచ్చు. విద్యుత్తు ఆదా కూడా చేస్తుంది. దీని ధర ఎయిర్ కూలర్ కంటే ఎక్కువ. ఎయిర్ కండీషన్ కంటే తక్కువగా ఉంటుంది. వాటర్ రీప్లేస్మెంట్ అవసరం లేదు. కోస్టల్ ఏరియాస్ వాడుకోవచ్చు.

విలువలే.. వెలుగులు

విద్యార్థుల జీవితాలకు అవసరం

విలువల రక్షణకు ప్రభుత్వం సన్నద్ధం

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ప్రస్తుతం విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న విపరీత పోకడలు, అనైతిక పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో నైతిక విలువల మండలిని ఏర్పాటు చేయనున్నట్లు గత నెలలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకటించారు. దీంతోపాటు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లోనూ నీతి కథల పోటీలు నిర్వహించారు. ఈపరిణామం విలువల రక్షణకు ముందడుగేనని చెప్పాలి. దీనికితోడు ఇంటర్మీడియట్‌లో నైతిక విద్య సబ్జెక్టు మార్కులను ఉత్తీర్ణత శాతంతో కలిపితే ఆ దిశగా విద్యార్థుల్లో అవగాహన కలుగుతుంది. ప్రస్తుత రోజుల్లో ఉదయాన్నే పాఠశాలకో.. కళాశాలకో బయలుదేరిన తమ పిల్లలు సాయంత్రం ఇంటికి చేరేవరకూ ఆ తల్లిదండ్రులు పడే మానసిక సంఘర్షణ వర్ణనాతీతమని, అపహరణల పరంపర ఓ వైపు చిన్నపాటి ఒత్తిడి, మాటల పట్టింపులకు తట్టుకోలేక అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు మరోవైపు. ఇందుకు కారణం మార్కులే కొలమానం. తప్ప తమ పిల్లాడు లేదా తమ విద్యార్థి నైతిక విలువలను ఎంతవరకూ అనుసరిస్తున్నాడు అని ఎంత మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆలోచిస్తున్నారని విద్యారంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. మరో పక్క అరచేతిలో విజ్ఞానం పేరుతో విద్యార్థులు చరవాణిలతో సావాసం చేస్తూ చెడుతోవ పడుతున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయని, దీంతో రెండు పదుల వయసు నిండకుండానే తమ బంగారు భవితను నాశనం చేసుకునే ఘటనలు చూస్తున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్లను గౌరవించాలనే పేరుతో విద్యాలయాల్లో తోటి విద్యార్థులతో చేస్తున్న అమానవీయ క్రీడ ర్యాగింగ్ ప్రధాన కారణం. విలువల లేవన్నదనేందుకు కారణం.



తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు ప్రతి ఇంట్లో ఓ బామ్మో.. తాతయ్యో.. ఉండేవారు. తన మనవళ్లు, మనవరాలను కూర్చోబెట్టుకుని సుమతి శతకాలు, పెద్దబలశిక్ష, పద్యాలు, రామాయణం, మహాభారతంలోని ముఖ్య ఘట్టాలను బోధించేవారు. నేడు ఉమ్మడి కుటుంబాలు దూరమవుతున్న నేపథ్యంలో ఇంట్లో తాతలు, అవ్వలు ఉండే అవకాశాలు ఉండటం లేదు. నేడు పాఠశాల పిల్లలకు పద్యాలు, నీతికథలు తెలియవు. తల్లిదండ్రులదీ ఉరుకుల పరుగుల జీవన విధానం. బామ్మలు, తాతయ్యలు మనమలు, మనుమరాళ్లకు దూరంగా పల్లెలకు పరిమితమవుతున్నారు. తరగతుల్లో ఉత్తీర్ణత పెరగాలంటే మార్కులే కొలమానంగా భావిస్తూ బోధన సాగిస్తున్న ఉపాధ్యాయులు.. పాఠశాల నుంచి వచ్చాక అయినా ఖాళీ సమయాల్లో విలువల స్ఫూర్తి అందుకుంటారంటే బండెడు పుస్తకాల్లో పూర్తి చేయాల్సిన ఇంటిపని .. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులకు విలువల ఊసులు చెప్పే వారు కరవయ్యారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అంతరిక్షాన్ని అందుకుంటున్నామనే ఆనందం మన వెన్నంటే ఉన్నా విలువలు దూరమవుతున్న సమాజంలో నేటి తరం కాలం వెల్లదీస్తోంది.

నైతికతకు ప్రాధాన్యం ఏదీ?

జూనియర్ కళాశాలల్లో 2014 నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నైతిక విద్యను సబ్జెక్టుగా ప్రవేశపెట్టారు. వార్షిక పరీక్షలకు ముందు ఈసబ్జెక్టు పరీక్ష కూడా ఉంటుంది. తప్పని సరిగా రాయాలి .

నైతిక విలువల మండలి ఏర్పాటు

సమాజ వికాసం విద్యపైనే ఆధారపడి ఉంటుంది. ఈవ్యవస్థలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాలయాలు, ఆదర్శప్రాయంగా ఉండాలనే ఉద్దేశంతో వారు చేయాల్సినవి, చేయకూడనవి వంటి అంశాలతో విధివిధానాలు రూపొందించాలనే ముఖ్యమంత్రి సూచనల మేరకు రాష్ట్రంలో నైతిక విలువల మండలి ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మానవవనరుల మంత్రి ప్రకటించారు. ఈనిర్ణయం ద్వారా విద్యాలయాల్లో మాసిపోతున్న విలువల వికాసానికి దోహదపడుతుంది.



పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

నైతిక విలువలు పాటించడంలో ఆదర్శంగా నిలవాలి


ఆదిశేషయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



నైతిక విలువలు పాటించడంలో భారతావని ప్రపంచానికే ఆదర్శం. మహనీయులు, మానవీయత, నైతికతను చూపడం చరిత్రలో మిగిలిపోతారు. వారి స్ఫూర్తి విద్యార్థుల్లో నింపాలి. ఇందుకు మన చరిత్రపై అందరూ అవగాహన పెంచుకోవాలి. సమాజం, సంప్రదాయలపై గౌరవం పెరగాలంటే నైతిక విలువలతోనే సాధ్యం. అది విద్యార్థుల్లో జాతి భక్తిని ప్రేరేపించి ఉత్తమ వ్యక్తిత్వాన్ని ఇస్తుంది.


హాయ్! బుజ్జీ!!

జీవితం అంటేనే పోరాటం, అది ఎప్పుడూ ధర్మం వైపునే ఉండాలి
- గౌతమ బుద్ధుడు





వడ్రంగి పిట్ట దాని ముక్కుతో చాలా వేగంగా చెట్టుకు రంధ్రం చేసేయగలదు. ఒక్క సెకెనులో అది ఏకంగా 20 సార్లు చెట్టుని పొడిచేయగలదంటే నమ్మగలరా?

కవలలేరి?











పదమూడేళ్ల పిల్లాడు... యోగా గురువయ్యాడు!



■ ఎవరీ పిల్లాడు? మన పేజీలోకి ఎందుకొచ్చాడు?

బోలెడు ఆసనాలు నేర్పించే యోగా గురువు. ఇంత వరకే అయితే చెప్పక్కర్లేదు. మన దగ్గర చిన్నారులు యోగా నేర్చుకోవడం మామూలే కావచ్చు. కానీ ఈ అబ్బాయిది మనదేశమే కాదు. అందుకే మన పేజీలోకి వచ్చాడు మరి.

■ మరి పేరేంటీ? ఊరేంటీ?

ఈ అబ్బాయి పేరు అడమ్ అవిన్. వయసు పదమూడేళ్లు. ఉండేది అమెరికా ఫ్లోరిడాలోని ఫోర్ట్ లాడెర్‌డేల్.

■ అసలీ అబ్బాయి యోగా ఎక్కడ నేర్పిస్తాడు?

పొద్దున్నే టీవీలో యోగా నేర్పించడం చూసే ఉంటారుగా. అలా ఈ పిల్లాడు కూడా ఇక్కడి 'చిల్డ్రన్స్ టెలివిజన్ నెట్‌వర్క్'లో చిన్నారులకు యోగాసనాలు చెబుతుంటాడు. ఈ కార్యక్రమానికి 'వుఫ్ శాంతి' అని పేరు కూడా పెట్టారు. పిల్లలకు బొమ్మలంటే తెగ ఇష్టం కదా... అందుకే అడమ్... పెద్ద కుక్కబొమ్మలాంటి దుస్తులు వేసుకుని టెడ్డీబేర్‌లా వస్తాడు. కెమెరా ముందు అక్కడున్న చిన్నారులకు రకరకాల ఆసనాలు నేర్పిస్తాడు. మంచి మంచి విషయాలు చెబుతుంటాడు.

ప్రస్తుతం అక్కడ ప్రసారమయ్యే ఈ యోగా కార్యక్రమానికి ఆదరణ బాగా పెరిగిపోయిందట. అందుకే త్వరలో అమెరికా మొత్తం ప్రసారాలు చేయనున్నారు. ఫ్లోరిడాలో 'అతి చిన్న యోగా గురువు'గా పేరు తెచ్చేసుకుని ఫేస్‌బుక్‌ల్లాంటి వాటిల్లో వేల మంది అభిమానుల్ని తెచ్చేసుకున్నాడీ బుల్లి గురువు. అంతేకాదూ... చిన్నారుల ఆసుపత్రులకు వెళ్లి వాళ్లు సంతోషంగా ఉండటానికి సరదాగా యోగాసనాలు నేర్పిస్తున్నాడట.

■ ఇంతకీ అడమ్‌కీ యోగాపై ఆసక్తి ఎలా వచ్చింది?

అడమ్ వాళ్ల తాతయ్య 'నువ్వు నవ్వితే ప్రపంచమూ నవ్వుతుంది', 'నవ్వుతూ కృతజ్ఞతలు చెప్పాలి', 'మంచిగా ఆలోచిస్తే మంచే జరుగుతుంది' అనే మూడు మంత్రాలు చెప్పాడట. వాటి ప్రాముఖ్యతను అందరికీ చెప్పడానికి ఈ అబ్బాయి యోగా నేర్చుకుని పిల్లలకు చెప్పడం మొదలుపెట్టాడట. అడమ్ వాళ్ల అమ్మ రాసిన 'మై గ్రాండ్-డాగ్ వజ్ ఎ యోగా ఇన్‌స్ట్రక్టర్' పుస్తకానికి ఈ బుల్లి గురువు బొమ్మ కూడా వేశాడు. అచ్చం ఆ బొమ్మ వేషంలోనే తయారై టీవీలో యోగా చెప్పేస్తున్నాడన్నమాట.

■ మరి మనం చూడలేమా?

చక్కగా చూడొచ్చు. యూట్యూబ్‌లో ఈ కార్యక్రమానికి చెందిన వీడియోలున్నాయి. ఇంకా... త్వరలోనే యాపిల్ టీవీ, అమెజాన్ ఫైర్ టీవీ స్టిక్, సామ్‌సంగ్ స్మార్ట్ టెలివిజన్‌ల్లో ఈ యోగా గురువు కనిపించబోతున్నాడట.

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Quip = ఎగతాళి
- మాతృక = అసలు గ్రంథం

నవ్వుల జల్లులు!

బిట్టు: అక్కా! కంచంలో భోజనంతో పాటు రెండు స్పూన్లు కూడా వేశావెందుకు?

అక్క: నువ్వే కదరా రెండు స్పూన్లు నెయ్యి వెయ్యమన్నావు!

- **డి. శ్రీలత,** హైదరాబాద్

తల్లి: చింటూ! బొంబాయి రవ్వ తీసుకురా ఉప్మా చేసి పెడతా...

చింటు: ఇప్పుడు నేనొక్కడినే బొంబాయి వరకూ ఎలా వెళతానమ్మా!

- **మా.శ్రీ. రాజు,** పాల్వంచ

చిలిపి ప్రశ్న

తెల్లకోడిపుంజు గుడ్డు ఏ రంగులో ఉంటుంది?

- **ఆర్. శ్యామల,** హైదరాబాద్

సుడోకు

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3x3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.


2			4					
		6			7			3
	7	3	8	6		4		
4	2				1		3	
3				9				7
	6		2				9	8
		4		2	5	3	1	
6			3			5		
					4			2

రాయగలరా?

ఆధారాలతో ఆంగ్ల పదాలు రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ పదం వస్తుంది

ఆధారాలు:
1. హంస 2. కోతి
3. ఎలుక 4. పాము
5. గుడ్లగూబ 6. గాడిద

దారేది?



ప్రశ్న: హరికేన్, టైఫూన్, సైక్లోన్, తుపాన్‌ల మధ్య తేడాలేమైనా ఉన్నాయా?
- **టి. రజని,** దేవరపల్లి

హరికేన్, తుపాన్‌ల మధ్య తేడాలేంటి?



జవాబు: ఇవన్నీ కూడా... మెల్లగా వీచే గాలిలో ఒక్కసారిగా మార్పులు రావడం ద్వారా గాలి వేగం మోతాదు పెరిగిపోవటం వల్ల తలెత్తే భారీ ప్రకృతి వైపరీత్యాలే. ఇవి పరిసరాల్ని నాగరిక జీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. అయితే హరికేన్‌లు, టైఫూన్‌ల మధ్య తేడాని సాధారణంగా గాలి వేగాన్ని బట్టి విడమరుస్తారు. గాలివేగం గంటకు వంద కిలోమీటర్లను మించితే అది హరికేన్. గాలివేగం అంతకన్నా తక్కువగా ఉన్నట్లయితే టైఫూన్లు అంటారు. సైక్లోన్లు అంటే సముద్ర ఉపరితలంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డప్పుడు.... గాలి భూభాగం నుంచి సముద్రంలోకి వెళ్లి అక్కడ నీటి ఆవిరిని నింపుకుని తిరిగి తీర ప్రాంతాలకు చేరి ఉధృతమైన వర్షపాతానికి దారి తీస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రాల్లో ఇలాంటి ద్రోణులు ఎక్కువగా ఏర్పడుతుంటాయి. గాలిలో పీడనాలు మారినా లేదా సైక్లోన్ల ద్వారా పెనుగాలులు వీచినట్లయితే వాటిని తుపాన్లు అంటుంటారు. శాస్త్రీయంగా ఈ నాల్గింటి మధ్య కచ్చితమైన వ్యత్యాసం లేదు. అమెరికా, మధ్య అమెరికా ప్రజలు అన్ని రకాల గాలి దుమారాల్నీ హరికేన్‌లు, టైఫూన్లు అంటుంటారు. ఆసియాలోని మనం వీటిని తుపానులు, సైక్లోన్‌లు అంటాం.

- **ప్రొ॥ ఎ. రామచంద్రయ్య,** నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

సుడోకు:

జవాబులు: రాయగలరా: 1.Swan 2. Monkey 3. Rat 4. Snake 5. Owl 6. Donkey దాగిన పదం: Season కవలలేరి: a, c చిలిపిప్రశ్న: అసలు కోడి పుంజు గుడ్డే పెట్టదుగా!

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net

జాతర నిర్వహణకు రాజాల సమ్మతి

చాటింపుతో సన్నాహాలు

వెంకటగిరి, న్యూస్‌టుడే : దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణకు బుధవారం తొలి చాటింపుతో సన్నాహాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఇక్కడ అత్యంత వైభవంగా జరిగే ఈ జాతర నిర్వహణకు స్థానిక రాజాల నుంచి దేవస్థానం వర్గాలు అనుమతి పొందే కార్యక్రమాన్ని బుధవారం ఉదయం సంప్రదాయబద్ధంగా పూర్తిచేశారు. తొలుత రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర, పుర అధ్యక్షురాలు దొంతు శారద, ఉపాధ్యక్షుడు బీరం రాజేశ్వరరావు, పోలేరమ్మ దేవస్థానం మాజీ ఛైర్మన్ పులి కృష్ణారెడ్డి, తెదేపా పట్టణాధ్యక్షుడు ఆనంద్ తదితరులు దివంగత రాజ కుటుంబీకుడు వి.వి.ఆర్.కె. యాచేంద్ర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజాల నివాసంలోని బొడ్డుశయక వద్ద రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర చేతుల మీదుగా జాతర నిర్వాహకులకు, సంప్రదాయ నిర్వాహకులకు, రెడ్డి పెత్తనందారుడికి తాంబూలం అందజేశారు. గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణకు తమ సానుకూలతను తెలిపారు. వారి అనుమతితో జాతర నిర్వహణకు సంప్రదాయ నిర్వాహకులను దేవస్థానం పురమాయించింది. వచ్చే బుధవారం 6న రెండో చాటింపు వేస్తారు. వచ్చే నెల 13, 14 తేదీల్లో జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు వేగంగా చేస్తున్నారు. జాతరలో భక్తులు మొక్కుబడులు తీర్చుకొనేందుకు వీలుగా వచ్చే నెల 10వ తేదీ నుంచి ఘటోత్సవం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పోలేరమ్మకు భక్తులు ఉన్నారన్నారు. అనాదిగా జరిగే ఈ జాతర వైభవాన్ని మరింతగా పెంచాలన్నారు. గతేడాది ఆధునిక పరిజ్ఞానం వినియోగించి జాతర వైభవం పెంచారు. జాతర మనందరిది, కేవలం ప్రభుత్వంపైన వదిలేయకుండా ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటును అందించాలన్నారు. అమ్మవారి కృపకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి రామచంద్రయ్య, కౌన్సిలర్లు చంగారావు, మణి, శంకరయ్య, రమేష్, విశ్వనాధం, మంచిబాబు, తెదేపా పట్టణ ఉపాధ్యక్షుడు చంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, అధికార ప్రతినిధి కోటేశ్వరరావు, నేతలు మల్లారం బాబు, వీరయ్య, నాగరాజు, లాలాపేట సహకార సంఘం అధ్యక్షుడు వెంకటముని, సంప్రదాయ నిర్వాహకులు పెంచలయ్య, షణ్ముగం, మల్లి తదితరులు పాల్గొన్నారు.



సర్వజ్ఞ చేతుల మీదుగా తాంబూలం స్వీకరిస్తున్న సంప్రదాయ నిర్వాహకులు

అంతుచిక్కని వ్యాధిపై వీడని ఆందోళన





మెడపై గడ్డతో చిన్నారి .. వ్యాధితో బాధపడుతున్న మహిళ

మనుబోలుపాడు(దగదర్తి), న్యూస్‌టుడే : దగదర్తి మండలంలోని మనుబోలుపాడులో అంతు చిక్కని వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామంలో 30 మందికి పైగా ఈ వ్యాధితో ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో కొంత మంది రక్త నమూనాలను జిల్లా క్షయ నియంత్రణ అధికారి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలోని వైద్య బృందం సేకరించి పరీక్ష నిమిత్తం పంపారు. ఎక్కువ మందికి నెగటివ్ రిపోర్ట్ రావడం గమనార్హం. ఇద్దరికి మాత్రమే టి.బి ఉన్నట్లుగా (పాజిటివ్ రిపోర్ట్) వచ్చినట్లు తెలిసింది. దీనిపై జిల్లా క్షయ వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మనుబోలుపాడులో ఎక్కువ మంది క్షయ నివారణ మందులు వాడడం వల్లనే నెగటివ్ రిపోర్ట్ వచ్చిందని చెప్పారు. అయితే ఒకే సారి ఇంత మందికి టి.బి వ్యాధి రావడం పట్ల సరియైన వివరణ ఇవ్వలేదు. రోగుల నివాసాల్లోని పశువుల రక్త నమూనాలను పశువైద్యులు సేకరించి రిపోర్ట్ కోసం పంపిఉన్నారు. ఇంతవరకూ వాటి వివరాలు రాలేదు. ఇంతమందికి ఒక్కసారిగా వ్యాధి ఎందుకు వచ్చిందో తెలియక గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి బంధువులు వచ్చేందుకు సైతం భయపడుతున్నట్లు వారు చెప్పారు. నాలుగేళ్లుగా కరవుతో అల్లాడుతున్నామని, ఇప్పుడు ఈ వ్యాధి కారణంగా కంటి మీద కునుకులేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మారెళ్లపాడులోనూ 13 మందికి ఈ వ్యాధి లక్షణాలు బయటపడినట్లు తెలిసింది. అధికారులు మాత్రం ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి అసలు వ్యాధిని కనిపెట్టి నివారణకు కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉత్తమ యువజన సంఘాల అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

స్టోన్‌హౌస్ పేట, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వము, యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం జిల్లా స్థాయిలో ఉత్తమ యువజన సంఘం అవార్డు 2016-17 ఏడాదికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువ కేంద్ర జిల్లా యువజన సమన్వయకర్త ఎస్. భరత్ ఓ ప్రకటనలో తెలిపారు. రిజిష్టర్ అయిన యువజన సంఘాలు యువతీ/మహిళా మండళ్లు గత ఏడాది 2016ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2017మార్చి 31వరకు విద్య, వైద్య, ఆరోగ్య, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రమదానం, స్వచ్ఛభారత్, వృత్తి శిక్షణ కార్యక్రమాలలో యువజనాభివృద్ధికి సేవలందించిన ఫోటోలు, పత్రికా ప్రచురణలను నిర్ణీత దరఖాస్తుతో జతచేసి యువకేంద్రం నెల్లూరు కార్యాలయానికి పంపాలన్నారు. ఎంపికైన సంఘానికి రూ. 25వేలు, ప్రశంసా పత్రం అవార్డు కింద అందజేస్తారన్నారు. అర్హత కలిగిన యువజన సంఘాలు, మహిళా మండళ్లు నెహ్రూయువకేంద్ర, కస్తూర్బా కళాక్షేత్రం, దర్గామిట్ట నెల్లూరులో దరఖాస్తులు పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను సెప్టంబర్ 20వతేదీలోగా అందజేయాలని కోరారు. వివరాల కోసం 0861-2328680ను సంప్రదించాలన్నారు.

కలవకూరులో సినిమా చిత్రీకరణ

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం కలవకూరులో సినిమా చిత్రీకరణను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. వారం రోజులుగా గ్రామంలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో నాయకానాయికలుగా శేఖర్‌శర్మ, వివ్య నటిస్తున్నారు. 600ఏళ్ల చరిత్ర కలిగిన సూర్యభగవాన్ చరిత్ర ఆధారంగా చిత్ర నిర్మాణం జరుగుతోందని నిర్మాత కోటి తూముల బుధవారం వెల్లడించారు. దసరా తర్వాత చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గూడూరుగ్రామీణం, న్యూస్‌టుడే : గూడూరు పట్టణంలోని వివేకానం దరోడ్డు ప్రాంతంలో ఈనెల 22వ తేదీన అర్ధరాత్రి జరిగిన గోవిందు నారాయణ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు గూడూరు పట్టణ సీఐ సుబ్బారావు తెలిపారు. గూడూరు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి మండలం మొక్కలపాడు గ్రామానికి చెందిన తాటి బోయిన నాగరాజు అనే వ్యక్తి నారాయణ షాపులో పనిచేస్తుండేవాడు. యజమాని నారాయణ చేతికి ఉన్న ఉంగరాలను దొంగలించాలనే ఉద్దేశంతో పథకం వేశాడు. ఆ రాత్రి నారాయణ మద్యం తాగి నిద్రిస్తుండగా వెంటనే రెగ్జిన్ కత్తిరించే కత్తెరతో గొంతు కోశాడు. కుడి కన్నుపై పొడిచి, ఛాతిమీద విచక్షణారహితంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావమవడంతో నారాయణ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అనంతరం నారాయణ చేతి వేళ్లకు ఉన్న ఉంగరాలు, జేబులో ఉన్న రూ.2 వేలు నగదును తీసుకొని పరారయ్యాడు. నిందితుడు బుధవారం గూడూరు టౌన్ వీఆర్‌వో అఖిల్ వద్ద లొంగిపోవడంతో అఖిల్ అందించిన సమాచారంతో ఎస్సై నరేష్ నిందితుడు నాగరాజును అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగరాజు, మణి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సెప్టెంబర్ 11నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

నెల్లూరు(విద్య),న్యూస్‌టుడే: ఈ ఏడాది విద్యా సంవత్సరానికి సంబంధించిన సమగ్ర మూల్యాంకనము-1(ఎస్‌ఏ-1) కాలనిర్ణయ పట్టిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా అధ్య యన, శిక్షణాసంస్థ విడుదల చేసిందని విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మేటివ్-1 పరీక్షలు సెప్టెంబర్ 11వ తేదీ నుంచి జరుగుతాయని తెలిపారు. పరీక్ష కాలనిర్ణయ పట్టిక ప్రకారం 11వతేదీన ఓరియంటల్ లాంగ్వేజ్, 12న తెలుగు, 13న హిందీ, 14న ఇంగ్లిషు, 15న లెక్కలు, 16న ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, 18న సోషల్ పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.45 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన:** శతక శంఖారావం ముగింపు మహోత్సవం... 06-30: **అన్నదాత,** 07-00: **ఈటీవీ న్యూస్,** 07-30: **శుభమస్తు:** విద్యాగణపతి ప్రత్యేకత ఏమిటి? వ్యాపారం పెరగడానికి గణేశ శ్రీవాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: **టాలీవుడ్ టైమ్,** 09-00: **ఈనాడు సినిమా: పాడుతా తీయగా...** (వినీత్, హీరా).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు 'వంకాయ బజ్జీ కూర', మీచేతి వంట 'పెసల పులావ్', 'మేథి క్యారెట్ ఫ్రై', జస్ట్ ఎ మినిట్ 'బేసిన్ బర్ఫీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు** (విధి 2) (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్–2** (రిపీట్), 05-30: **ఆడాళ్ళా మజాకా:** రావులపాలెం అతివలు ఉత్సాహంగా పాల్గొన్న గేమ్ షో..., 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్,** 09-30: **జబర్దస్త్:** మనసారా నవ్వుకోవడానికి మంచి సమయం..., 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డిజె రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డిజె
10:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా.8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ.3:00, రా.09:00)
- ★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ.09:30, మ.2:00, సా.04:00, రా.7:00)
- ★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30).
- ★ విహారి (మ.12:00, సా.6:30, రా.10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ (మ.1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మిస్ 420 (అశ్విని నాచప్ప, రాజ్‌కుమార్), 10-00: మార్నింగ్ షో: రాధా కల్యాణం (రాధిక, చంద్రమోహన్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: పోకిరి రాజా (వెంకటేశ్, రోజా), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఖబడ్దార్ (సాయికుమార్, భావన), రాత్రి: 7-00: ఫస్ట్ షో: బుద్ధిమంతుడు (ఏఎన్నార్), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: **బ్రేక్ ఫాస్ట్ షో** - ఫ్రైడ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ మూంగ్ స్ప్రౌట్స్ దోశ, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో** – ఎగ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ చికెన్ నగ్గెట్స్, **ఉ.10.00:** పిండివంటలు, ప్రసాదాలు – చిట్టి చెగోడీలు & పులిహోర, **ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు** – స్వీట్ పన్నీర్ బుర్జీ, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ)** – డైజెస్టివ్ డ్రింక్, **ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్"** - గన్ పౌడర్ & ఇడ్లీ, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** (తమిళనాడు క్యూసైన్) - డ్రై ఫ్రూట్స్ సుజీయాం, **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్** – రామ్ లడ్డూ, **మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - బ్రేక్‌ఫాస్ట్ ఉప్మా, **మ.12.45: సూప్స్ & స్టార్టర్స్** - ప్రాన్స్ అండ్ బేబీకార్న్ కట్‌లెట్, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మిక్స్‌డ్ క్యూసైన్)** – లాంబ్ స్కివర్స్ & జింజర్ గార్లిక్ ఆసియన్, **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - చికెన్ మిర్చి బజ్జీ, **మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్** – పెరటి రుచులు, **మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్** – కోల్హాపూరి పన్నీర్, **మ.2.30: చోటా షెఫ్** – చికెన్ చీజ్, **మ.5.15: స్నాక్స్** - పన్నీర్ చీజ్ తవ రోటీ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **లాలిజో పాపాయి, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సిద్ధివినాయక స్వామి మందిరం, ప్రభాదేవి, ముంబయి, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ అష్టవినాయక దర్శనం, మహారాష్ట్ర, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **లాలిజో పాపాయి,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 31-08-2017

SVBC TTD

ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 క్షేత్రదర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాస గద్యం + లక్ష్మీనరసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - కర్నాటక, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం అశ్వమేధపర్వం.

భక్తి TV

ఉదయం: 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 08-00 గణపతి దర్శనం, 08-30 మహాగణపతిం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందే హాలు, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-00 శ్రీగణేశస్తోత్రం, 05-30 సాయి గీతామృతం, 06-00 సద్గురు స్తోత్రం, 07-00 భక్తివిశేషాలు, **రాత్రి:** 07-30 అమృతకలశం, 08-00 మహాగణపతిం(లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 జై..జై..గణేశా:, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Z తెలుగు

ఉదయం: 07-30 శుభమస్తు, 08-00 సినిమా: త్రిపుర, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా:పంచాక్షరి.

maa

ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: **రాజా రాణి, మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: **అందరివాడు, సాయంత్రం:** 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

GEMINI

ఉదయం: 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ఇంగ్లీష్ పెళ్లాం ఈస్ట్ **గోదావరి మొగుడు, మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: వీడే, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 09-30 సినిమా: జేమ్స్‌బాండ్.

వేరుశనగలో తెగుళ్ల నివారణ

వేరుసెనగ పైరును ఆశించి నష్ట పరుస్తున్న తెగుళ్లు, వాటి నివారణ చర్యలను సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ శివకుమార్ వివరించారు.

శిలీంద్ర తెగుళ్లయిన ఆకుమచ్చ తెగులు, తుప్పు తెగులు గాలి ద్వారా వ్యాపిస్తాయి. వైరస్ వల్ల వచ్చే మొవ్వుకుళ్లు, కాండంకుళ్లు, తెగుళ్లు తామర పురుగుల ద్వారా వ్యాపిస్తాయి.



ఆకుపై తుప్పు మచ్చలు

తిక్కా ఆకుమచ్చ: ఇందులో రెండు రకాల ఆకుమచ్చ తెగుళ్లను గమనించవచ్చు. ఈ తెగులు సెర్కోస్పోరా శిలీంద్రం వల్ల కలుగుతుంది. త్వరగా వచ్చే ఆకుమచ్చ తెగులు మచ్చలు కొంచెం గుండ్రంగా ఉండి ఆకు పైభాగాన ముదురు గోధుమరంగు కలిగి ఉంటాయి. ఆలస్యంగా వచ్చే ఆకుమచ్చ తెగులు మచ్చలు చిన్నగా, గుండ్రంగా ఉండి, ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి. ఆకమచ్చ తెగులు వల్ల ఆకు రాలిపోయి దిగుబడి బాగా తగ్గిపోతుంది. మచ్చలు, ఆకులు, కాండం, కొమ్మలు, ఊడల మీద కూడా మచ్చలు ఏర్పడతాయి. నివారణకు మంచి విత్తనాన్ని ఎన్నుకుని విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి. సజ్జ, మొక్కజొన్న, వరిపైర్లతో పంటమార్పిడి చేయాలి. ఆకులపై మచ్చలను గమనించిన వెంటనే 400 గ్రాములు క్లోరోథలోనిల్ లేదా 400 మి.లీ. హెక్సాకొనజోల్‌ను 200 లీ. నీటిలో కలిపి ఎకరా పైరుపై పిచికారి చేయాలి. తెగులును తట్టుకునే రకాలైన అభయ, వేమన, జేసీజీ-88 వంటి రకాలను సాగు చేయాలి.

తుప్పు మచ్చలు: దీన్నే కుంకుమ తెగులు అంటారు. ఈ తెగులు రబీలో అధికంగా ఆశిస్తుంది. ఆకుల అడుగు భాగంలో ఇటుకరంగు గల చిన్న పొక్కులు ఏర్పడతాయి. ఇదే ఈ తెగులు ముఖ్య లక్షణం. ఆకు పైభాగంలో పసుపురంగు మచ్చలు కనబడుతాయి. తెగులు ఉధృతి అధికమైనప్పుడు మొక్క అన్ని భాగాలపై పొక్కులు కనబడుతాయి. దీని నివారణకు 400 గ్రాములు క్లోరోథలోనిల్ లేదా 400 గ్రాములు ట్రయిడిమార్ఫ్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పైరుపై పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ (చిత్తూరు జిల్లా)

పత్తిలో సస్యరక్షణ చర్యలు

రాష్ట్రంలో పత్తిని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ పంట దిగుబడులను ప్రభావితం చేసే చీడపీడలను సకాలంలో గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటిస్తేనే ఆశించిన లాభాలు వస్తాయని వ్యవసాయ సహాయ సంచాలకుడు తోట శ్రీనివాసరావు తెలిపారు.

బ్యాక్టీరియా నల్లమచ్చల తెగులు: ఈ తెగులు మొక్క వివిధ దశలలో వివిధ రూపాలలో కన్పిస్తుంది. ముందుగా ఆకులపై కోణాకారంలో నూనె రంగు మచ్చలు ఏర్పడి తర్వాత నల్లగా మారి మూడో దశలో ఆకుల ఈనెల ద్వారా తెగులు వ్యాపించి నల్లగా మారుతుంది. తెగులు ఉధృతి ఎక్కువైతే కొమ్మలకు కూడా వ్యాపించి కొమ్మలు నల్లగా మారి ఎండిపోతాయి. దీన్నే బ్లాక్ ఆర్మ్ అని పిలుస్తారు. ఈ తెగులు పూలకు, కాయలకు సోకినప్పుడు పరిపక్వం చెందకుండానే పండి రాలిపోతాయి.

నివారణ చర్యలు: తెగులు సోకిన మొక్కల భాగాలను తీసి నాశనం చేయాలి. కిలో విత్తనానికి 10 గ్రా. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌తో విత్తనశుద్ధి చేయాలి. ఉధృతిని బట్టి 3, 4 సార్లు 15 రోజుల వ్యవధిలో 10 లీటర్ల నీటికి పోషామైసిన్ లేదా ప్లాంటామైసిన్ 1 గ్రా. కాపరాక్సీక్లోరైడ్ 30 గ్రా. కలిపి పిచికారి చేయాలి.

వేరుకుళ్లు తెగులు: భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు అన్ని దశల్లో కనపడుతుంది. అర్ధంతరంగా మొక్క ఎండిపోవడం ఈ తెగులు లక్షణం. ఒక్క రోజులోనే మొక్క ఎండిపోతుంది. తెగులు సోకిన మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి. మొక్కలోని అన్ని భాగాలు పైనుంచి కిందకు వాడిపోయి వేలాడుతూ ఉంటాయి. తెగులు సోకిన మొక్కలను తేలికగా పీకేయవచ్చు. ఎదిగిన మొక్కలు వాడిపోయి పసుపుబారి రాలిపోతాయి.

నివారణ చర్యలు: పంటమార్పిడి పాటించాలి. తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. కిలో విత్తనానికి 2 గ్రాములు కార్బండిజమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సిఫార్సు మేరకు పొటాష్ ఎరువులు వేయాలి.

వడలు తెగులు: ఈ తెగులు పత్తి అన్ని దశల్లో కన్పిస్తుంది. ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలో ఈ తెగులు ఎక్కువగా ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు ఆకులు వాడిపోయి, ఈనెల మధ్య భాగం పసుపురంగుకు మారుతుంది. ఆ తర్వాత ఎర్రబారుతుంది. కాండాన్ని చీల్చి చూస్తే నల్లని బూజుతో చారలు కన్పిస్తాయి.

నివారణ చర్యలు: పంటమార్పిడి చేయాలి. తెగులు సోకిన మొక్కలను పీకేయాలి. సిఫారసు చేసిన మోతాదులో పొటాష్ ఎరువులను వాడాలి. కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి తెగులు సోకిన మొక్కల మొదళ్ల చుట్టూ తడపాలి.

నిధులు రావు పనులు సాగవు

సాగునీటి కోసం ఎనిమిదేళ్లుగా నిరీక్షణ

రాష్ట్ర ప్రభుత్వం జల వనరుల పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నా జిల్లాలో మాత్రం అనేక పనులు అసంపూర్తిగానే మిగులుతున్నాయి.. ఏళ్ల తరబడి నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు కన్నీరే మిగులుస్తున్నాయి.. కారణాలేవైనా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.. దీంతో పలు నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలకు నీరందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా రూ. కోట్లు ఖర్చు పెట్టి చేసిన పనులు నిరుపయోగంగా ఉన్నాయి.

న్యూస్‌టుడే, చేజర్ల

వేలాది ఎకరాల మెట్ట భూములకు సాగునీరందించల్సిన సాగునీటి పథకాలు నిధుల కొరతతో నీరసించాయి. మూడేళ్లుగా జరుగుతున్న పనులకు చెల్లింపులు జరగకపోవటంతో గుత్తేదారులు పనులు అర్ధంతరంగా వదిలేసే పరిస్థితి ఏర్పడింది. సవరించిన అంచనా(పీఆర్‌ఈ) ఆమోదం జరగనిదే బకాయిలు చెల్లించేది లేదని ఆర్థికశాఖ చెబుతుండటంతో పనులు ముందుకు సాగటం లేదు. ఫలితంగా జిల్లాలో 25 వేల ఎకరాలకు సాగునీరందించాల్సిన 153 పనులు నిలిచిపోయాయి. వరదలు, భారీ వర్షాలు వస్తే నిలిచిపోయిన పనులు నామరూపాల్లేకుండా కొట్టుకొనిపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే నీరొస్తుందని ఆశిస్తున్న రైతులకు మరింత కష్టనష్టాలు ఎదురవుతాయి.

ఆమోదం పొందని సవరించిన అంచనా

సాగునీటి పథకాలకు మూడేళ్లకోసారి మారిన ధరలు, సవరించిన అంచనాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరిస్తారు. తెలుగు గంగ, అందులో అంతర్భాగమైన స్వర్ణముఖి-సోమశిల పథకాలకు సంబంధించిన సవరించిన అంచనా(పీఆర్‌ఈ) గత నాలుగేళ్లుగా ఆమోదానికి నోచుకోలేదు. దీంతో కండలేరు జలాశయానికి ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన పనులకు చెల్లింపులు జరగలేదు. గుత్తేదారులకు రూ. 50 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లింపులు చేయాల్సి ఉంది. నిధులు మంజూరు కాకపోవటంతో గుత్తేదారులు అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. దీంతో సోమశిల-కండలేరు, సాయిగంగ కాలువలపై చేపట్టిన సాగునీటి కాలువలు, జలాశయాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా ఆత్మకూరు, వెంకటగిరి, సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల భూములకు నీరందని పరిస్థితి ఏర్పడింది.



అసంపూర్తిగా ఉన్న చవటపల్లి జలాశయం

సచివాలయం స్థాయిలో..

పీఆర్‌ఈ ఆమోదం ఆర్థికశాఖ పరిధిలో ఉందని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. నిధుల అవసరం, స్థానిక పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించాం. అయినా సచివాలయంలో దస్త్రాలకు ఆమోదం లభించని కారణంగా బిల్లుల చెల్లింపులు జరగలేదు. ఈ కారణంగా గుత్తేదారులు అసంపూర్తిగా పనులు వదిలేస్తున్నారు. దీంతో లక్ష్యం నెరవేరటం లేదు.

రూ. 50 కోట్లిస్తే పాతిక వేల ఎకరాలకు నీరు

సోమశిల-స్వర్ణముఖి, సాయిగంగ కాలువల పరిధిలో అసంపూర్తి పనులకు ప్రభుత్వం రూ. 50 కోట్లు విడుదల చేస్తే 25 వేల ఎకరాల మెట్ట భూములు సాగులోకి వస్తాయి. ఎకరానికి రూ. 50 వేల రాబడి వచ్చినా ఏటా రూ. 125 కోట్ల విలువ చేసే పంట పండుతుంది. ఎకరానికి రూ. 20 వేల మిగులు లభించినా రూ.50 కోట్ల రాబడి వస్తుంది. 40 గ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుంది. ఇతర పథకాలతో పోలిస్తే స్వల్ప వ్యయంతో నీరందించే వీలున్నా శాఖల మధ్య సమన్వయ లోపంతో ఈ పథకాలు నత్తతో పోటీ పడుతున్నాయి.



పూర్తికాని రివిట్‌మెంట్

వరదలొస్తే విపత్తే

ఎస్‌ఎస్‌ఎల్‌సీ ప్యాకేజి-12లో భాగంగా సోమశిల-కండలేరు వరద కాలువకు దిగువన నిర్మించిన నాలుగు చెరువుల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. 2015 తరహాలో భారీ వర్షాలు వరదలొస్తే ఈ చెరువులు గట్లు తెగి దిగువన ఉన్న నీటి వనరులు, రహదారులకు భారీ నష్టం కలిగించే ప్రమాదం ఉంది. ఈ సమస్య ఉత్పన్నం కాక ముందే నిర్మాణాలు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

సోమశిలలో 11.6 టీంఎసీల నీటిమట్టం

సోమశిల, న్యూస్‌టుడే : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం బుధవారం ఉదయం 6 గంటలకు 6,357 క్యూసెక్కుల నుంచి సాయంత్రం 6 గంటలకు 5,500 క్యూసెక్కులకు తగ్గింది. నీటినిల్వ 11.6 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 84.430 మీటర్లు, 277 అడుగుల మేర ఉంది. జలాశయం నుంచి నెల్లూరు నగర తాగునీటి అవసరాలకు 50 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా సగటున 57 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

వ్యవసాయ యాంత్రికీకరణపై గిరిజన రైతులకు అవగాహన అవసరం

నెల్లూరు(సంక్షేమం), న్యూస్‌టుడే: గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో యాంత్రాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఐ.టి.డి.ఎ. పి.ఒ. కమలకుమారి పేర్కొన్నారు. నెల్లూరులోని ఐ.టి.డి.ఎ. కార్యాలయంలో బుధవారం గిరిజన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటవీ హక్కుల చట్టం కింద జిల్లాలో ఇంత వరకు 871 ఎకరాలు గిరిజనులకు పంపిణీ చేశామన్నారు. వీటిలో భూమి అభివృద్ధి పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భూముల్లో కంది, అపరాలు, చిరుధాన్యాలు వంటి పంటలు పండించుకోవాలన్నారు. వ్యవసాయ సహాయ ప్రాజెక్టు అధికారి ఆర్. గంగాధర్ మాట్లాడుతూ పవర్ వీడర్, టిల్లర్, అయిల్ ఇంజన్లు, రోటోవేటర్లు వివిధ యంత్ర పరికరాలు వినియోగించుకుని వ్యవసాయ పనుల్లో అభివృద్ధి సాధించాలన్నారు. గత ఏడాది 173 మంది రైతులకు రూ.65లక్షలు విలువైన యంత్రపరికరాలను వ్యవసాయశాఖ సమన్వయంతో 90శాతం రాయితీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. 2017-18 సంవత్సరానికి రూ.66 లక్షల విలువైన యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ యంత్ర పరికరాలు ప్రదర్శనగా ఉంచారు. ఈకార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.జ్యోత్స్న, జిల్లా యానాది సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.సి. పెంచలయ్య, యంత్రపరికరాల డీలర్ శ్రీకాంత్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

బీసీ సమాఖ్య రుణాలు వ్యక్తిగతంగా పొందవచ్చు

నెల్లూరు (సంక్షేమం) , న్యూస్‌టుడే: బీసీ సమాఖ్య రుణాలను సంఘ సభ్యుల కలిసి లేదా, వ్యక్తిగతంగా సభ్యులు రుణాలు పొందవచ్చని బీసీ కార్పొరేషన్ ఇ.డి. వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సంఘానికి నిధులు మంజూరు చేసేవారని, ఈసారి ప్రభుత్వం జీవోనంబరు 18 ప్రకారం సంఘ సభ్యులు తీర్మానం చేసుకుని రుణాలను వ్యక్తిగతంగా తీసుకునే అవకాశం కల్పించిందన్నారు. ఇందుకు గాను సంఘం తీర్మానాన్ని ఆయా మండలాల ఎం.పి.డి.ఒలకు, బ్యాంకర్లకు సమర్పించాలన్నారు. ఇటీవల జరిగిన సంఘాల సభ్యులు కూడా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

గాంధి ఆశ్రమాభివృద్ధికి సహకారం : కలెక్టర్

పల్లిపాడు (ఇందుకూరుపేట), న్యూస్‌టుడే: సబర్మతి ఆశ్రమంలో మాదిరిగానే పల్లిపాడు గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో నిత్యం బోధనలు జరగాలని, గాంధీజీ అనుసరించిన ఆశయాలకు అనుగుణమైన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు సూచించారు. బుధవారం ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సబర్మతి ఆశ్రమం తర్వాత మహాత్మా గాంధీజీ స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడు సత్యాగ్రహ ఆశ్రమం దేశంలోనే రెండోదని చెప్పారు. గాంధీజీని ప్రపంచం మొత్తం ఆదర్శంగా తీసుకుందన్నారు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచే ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి భావితరాలకు స్ఫూర్తి నింపుతామన్నారు. ప్రస్తుతం యువత గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈఈ విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలో పర్యటక రంగ అభివృద్ధికి రూ.1.65 కోట్లు మంజూరైతే.. కలెక్టర్ చొరవ తీసుకుని ఆగిపోయిన పనుల కోసం రూ.95 లక్షలు ఆశ్రమానికి కేటాయించారని చెప్పారు. మరో పది రోజుల్లో భవనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు నేదురుమల్లి సుబ్బారెడ్డి, నెల్లూరు లక్ష్మయ్య, రాము తదితరులున్నారు.



గాంధి విగ్రహానికి నమస్కరిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

రూ.కోటికి కన్నం!

(మొదటి పేజీ తరువాయి) విభాగం సిబ్బంది పరిశీలించి అనుమతులు జారీ చేయనున్నారు. ప్రజలకు జవాబుదారీ తనాన్ని పెంచటం కోసం అధికారులు సాంకేతికను జోడించారు. దీన్ని కూడా నిర్వీర్యం చేసే విధంగా సిబ్బంది వ్యవహరించటం గమనార్హం. ఏడాదిగా ఇదే తీరులో ప్లాన్‌ల మంజూరు జరుగుతోంది.

ఏమైనా చేయగలరు

భవన నిర్మాణం పూర్తయిన తర్వాత రెవెన్యూ విభాగం సిబ్బంది వెళ్లి భవనం కొలతలను పరిశీలించి.. అందుకు అనుగుణంగా నిబంధన మేరకు పన్ను విధించాల్సి ఉంది. సాంకేతికత అందుబాటులోకి రావటంతో అంతా సవ్యంగా ఉంటుందని అధికారులు సైతం భావించారు. ఎక్కడ అవకాశం ఉంటుందో వెతకటంలో కొందరు సిబ్బందికి పేరుంది. సాంకేతికను చొప్పించినా పన్ను మదింపులో భారీగా అక్రమాలకు ఆస్కారం ఏర్పడింది. పన్ను వసూళ్లలో భారీ అక్రమాలకు పాల్పడ్డారు.

జేబులు నింపుతున్నారు

నగర పరిధిలో పన్ను మదింపులో అక్రమ మార్గంలో రెవెన్యూ సిబ్బంది జేబులు నింపుకొంటున్నారు. కొత్తగా నిర్మించిన భవనాల్లో చాలా వరకు పట్టణ ప్రణాళిక విభాగం నుంచి తీసుకున్న ప్లాన్ మేరకు ఉండవు. అతిక్రమణలకు జరిమానా విధించే హక్కు నగరపాలక సంస్థకు ఉంది. పట్టణ ప్రణాళికా విభాగం నుంచి తీసుకున్న ప్లాన్‌లో 100 చదరపు అడుగులుగా చూపిస్తే.. వాస్తవ నిర్మాణం కనీసం 200 చదరపు అడుగులు ఉంటుంది. మొదటి అంతస్తు నిర్మిస్తే విస్తీర్ణం 400 చదరపు అడుగులు ఉంటుంది. పట్టణ ప్రణాళికా విభాగం రికార్డుల ప్రకారం రెండు అంతస్తులు కలిపి 200 చ.అ మాత్రమే. దీన్ని అడ్డం పెట్టుకుని రెవెన్యూ విభాగంలో కొందరు సిబ్బంది మాయాజాలం చేస్తున్నారు. నిబంధనలను అతిక్రమించి ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేసిన వారి నుంచి జరిమానా విధించాల్సింది పోయి.. ప్లాన్ ప్రకారం పన్ను విధించి.. జరిమానా మొత్తం సుమారు రూ.కోటి వరకు జేబులో వేసుకుంటున్నారు.

కంప్యూటర్లను ప్రవేశపెట్టినా..

పన్ను మదింపులో కంప్యూటర్‌లను ప్రవేశపెట్టినా అక్రమాలు ఎలా జరుగుతున్నాయి? ఇదే అందరికీ ఉన్న సందేహం. వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఉన్న కొలతలను నమోదు చేస్తే.. కింది అంతస్తు 200 చ.అ ఉంటుంది. మొదటి అంతస్తు కూడా ఇంచుమించు అలాగే ఉంటుంది. భవనం కొలతలను కంప్యూటర్‌లో నమోదు చేసిన తర్వాత.. పన్ను మదింపు దగ్గరకు వచ్చేప్పటికి నేరుగా 200 చ.అ చూపిస్తున్నారు. దీంతో ఎలాంటి జరిమానా లేకుండా పన్ను లెక్కిస్తుంది. కానీ, వాస్తవంగా ప్లాన్‌ను అతిక్రమించినందుకు విధించాల్సిన జరిమానా మొత్తం నగరపాలక సంస్థకు చెందకుండా పోతోంది. ఇలా పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడ్డారు. వేలాది నిర్మాణాలకు సంబంధించి సాంకేతికతను కూడా పక్కదోవ పట్టించి రెవెన్యూ విభాగంలోని కొందరు సిబ్బంది జేబులు నింపుకున్నారు.

- రెవెన్యూ సిబ్బంది చేసిన అక్రమాలు రూ.కోట్లలో ఉంటుందని సమాచారం. కేవలం జరిమానా మొత్తంలో లెక్కలను గోల్‌మాల్ చేసి రూ.కోటి వరకు మింగేశారని తెలుస్తోంది. కేవలం కంప్యూటర్‌లో గణాంకాల నమోదు సమయంలో ప్రదర్శించిన తెలివితో భారీ అక్రమాలకు ఆస్కారం ఏర్పడింది. ప్లాన్ మంజూరు, పన్ను మదింపులో అక్రమాలకు చెక్ పెట్టడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తే.. దాన్ని కూడా వక్ర మార్గానికి మళ్లించారు. వెరశి సాంకేతికతకూ మరక అంటించటం రెవెన్యూ విభాగం సిబ్బందికే సాధ్యమైంది.

1200 మెగావాట్ల విద్యుదుత్పాదన

నేలటూరు(ముత్తుకూరు), న్యూస్‌టుడే: నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్ర రెండు యూనిట్లలో బుధవారం 1200మెగావాట్ల విద్యుదుత్పాదన జరిగింది. ఒక్కో యూనిట్‌లో 600మెగావాట్ల చొప్పున సరఫరాను పవర్‌గ్రిడ్‌కు అందిస్తున్నారు. ప్రస్తుతం ప్లాంటులో 80వేల టన్నుల బొగ్గు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. గ్రిడ్ సూచన మేరకు ఉత్పత్తి ఇంకా తగ్గించే అవకాశం ఉందని వారు చెప్పారు.

చెరువులో పడి చిన్నారి మృతి



మృతదేహం వద్ద బంధువుల రోదన

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్ద చెరువులో పడి మూడో తరగతి విద్యార్థి మేకల స్రవంతి (8) మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు ఎస్టీ కాలనీకి చెందిన మేకల సుధారాణి రెండో కూతురు స్రవంతి చిన్నారులతో కలిసి ఆడుకోవడానికి బడి సమయం పూర్తయ్యాక సమీపంలోని చెరువు దగ్గరకు వెళ్లారు. చెరువు సమీపంలో ఆడుకుంటున్న బాలిక కొద్ది సమయం తర్వాత అక్కడ కాలకృత్యాలు తీర్చుకుని గుంతలో దిగింది. బురదగా ఉండటంతో బాలిక కూరుకుపోయింది. స్థానికులు అప్రమత్తమై కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. ఇక్కడ భారీ గుంతలు తీయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. బాలిక మృతితో స్థానికుల్లో విషాదం అలుముకుంది.

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు

సంస్కరణలకు పూర్వం భారతదేశంలో వృద్ధిరేటు అల్పంగా, అసంతృప్తికరంగా ఉండేది. దీనికి కారణం ప్రభుత్వరంగ సంస్థల అసమర్థత, ప్రయివేటు రంగంపై నియంత్రణలు, విదేశీ మూలధనం, విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో 1991 ప్రారంభంలో భారతదేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1980 దశకంలో భారత ప్రభుత్వం అమలు చేసిన సురక్షితంకాని స్థూల ఆర్థిక విధానాలే ఆర్థిక అసమతౌల్యానికి దారితీశాయి. 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 5.1 శాతంగా ఉన్న కోశలోటు 1990-91 నాటికి 7.8 శాతానికి చేరుకుంది. ఈ లోటు సర్దుబాటు కోసం ప్రభుత్వం దేశీయ రుణ సమీకరణ చేసింది. 1980-81 లో ఈ రుణం స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం కాగా, 1990-91 నాటికి 50 శాతానికి చేరింది. ఇంతేకాకుండా విదేశీ వ్యాపార చెల్లింపుల శేషపు కరెంట్ ఖాతా లోటు 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 1.39 శాతం లేదా 2 బిలియన్ డాలర్లు కాగా, 1990-91 నాటికి 3.9 శాతం లేదా 9.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ విపత్కర పరిణామాల కారణంగా భారత ప్రభుత్వ విదేశీ రుణం 1980-81 లో జీడీపీలో 12 శాతం ఉండగా, 1990-91 నాటికి 23 శాతానికి చేరింది. విదేశీ మారక నిధులు కేవలం ఒక వారానికి సరిపడే దిగుమతుల స్థాయికి పడిపోయాయి. ద్రవ్యోల్బణం 1980-81 లో 6.7 శాతం నమోదు కాగా 1990-91 నాటికి 10 శాతానికి చేరుకుంది. దీనికి తోడు 1990 ఆఖరి దశకంలో ఏర్పడిన గల్ఫ్ సంక్షోభం పెట్రోలు ధరల పెరుగుదలకు కారణమై ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్ర స్థాయికి చేర్చింది.

ఆర్థిక సంక్షోభాన్ని నివారించి అంతర్గత, బహిర్గత నమ్మకపు స్థాయిని నిలబెట్టుకోవడానికి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ చొరవతో 1991 లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. అందుకే వీటిని 'రావు-మన్మోహన్ నమూనా' అని కూడా పిలుస్తారు. ఈ సంస్కరణల ఫలితంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ స్థాయిలో విధానపరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ప్రపంచస్థాయిలో దేశం శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (LPG) విధానాన్ని అమలు చేసింది.

ఆర్థిక సంస్కరణల లక్ష్యాలు

ఎ) కోశ లోటును, రెవెన్యూ లోటును తగ్గించడం.

బి) ప్రభుత్వరంగ పరిధిని తగ్గించి, ప్రయివేటు రంగానికి అప్పగించడం.

సి) పారిశ్రామిక లైసెన్సులు ఎత్తివేయడం.

డి) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, విదేశీ వ్యాపారంలో సుంకాలు, కోటాలు ఎత్తివేయడం.

ఇ) ఆర్థిక వృద్ధిరేటును పెంచడం.

ఎఫ్) సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి ఉపాధిని విస్తరించడం.

జి) పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసాలు తగ్గించడం.

హెచ్) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభాను తగ్గించడం.

ఐ) ప్రాంతీయ అసమానతలు తగ్గించడం.

సంస్కరణల్లోని ముఖ్యాంశాలు

1980 వ దశకం మధ్యలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం విదేశీ వర్తకం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, విదేశీ మూలధనంపై ఆంక్షలను సడలించడానికి ప్రయత్నించినప్పటికీ, పూర్తిస్థాయి సంస్కరణలు మాత్రం 1991 లోనే జరిగాయి. ఈ నూతన ఆర్థిక సంస్కరణలను రెండు విధాలుగా చెప్పవచ్చు. 1) స్వల్పకాలానికి సంబంధించిన స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు, 2) దీర్ఘకాలానికి సంబంధించిన నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు.

స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు

ఆర్థిక వ్యవస్థలో వెంటనే సర్దుబాటు చేసేందుకు ఉపయోగించిన ఈ చర్యలనే డిమాండ్ నిర్వహణ చర్యలు అంటారు. దీనిలో భాగంగా ద్రవ్య సప్లయ్‌ని తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, కోశ సర్దుబాటు చర్యల్లో భాగంగా రాబడిని పెంచి, వ్యయాలను తగ్గించడం, విదేశీ చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు మూల్యహీనీకరణ లాంటి చర్యలను సూచించారు.

వీటిలో ప్రధానంగా పన్ను రాబడిని పెంచేందుకు 1991, 1998 లలో రాజా చెల్లయ్య కమిటీని, ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించేందుకు 2000 లో గీతాకృష్ణన్ కమిషన్‌ను నియమించారు. ఇవేకాకుండా పన్నేతర రాబడిని పెంచేందుకు నీటిపారుదల, విద్యుత్, రోడ్లు మొదలైన వాటిపై యూజర్ చార్జీలు విధించారు. కోశలోటును తగ్గించేందుకు భారత ప్రభుత్వం 2003 లో 'కోశ సంస్కరణల బడ్జెటరీ నిర్వహణ చట్టాన్ని' (FRBM) ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రెవెన్యూ లోటును 2008–09 నాటికి 0 శాతానికి, కోశలోటును 3 శాతానికి తగ్గించగలగాలి. ఈవిధంగా తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు 1991 జులై 1, 3 తేదీల్లో రెండు సార్లు మూల్యహీనీకరణ (18% నుంచి 19% మేరకు) చేశారు.

భారతదేశంలోని ఆర్థిక సంస్కరణలను మూడు ప్రతిపాదనలకు సంబంధించిన అంశంగా పరిగణించాలి. అవి: ప్రయివేటీకరణ, సరళీకృత విధానాల అమలు, ప్రపంచీకరణ. ప్రయివేటీకరణ - ప్రభుత్వరంగ సంస్థలు, విధులను ప్రయివేటు రంగపరం చేయడాన్ని తెలుపుతుంది. సరళీకృత విధానాలు - ప్రభుత్వ ఆంక్షలు, నియంత్రణలను సడలించి పారిశ్రామిక, ద్రవ్య, విత్త, విదేశీ విధానం, విదేశీ పెట్టుబడుల్లో ఉదార వైఖరిని పాటించడాన్ని వివరిస్తాయి. ప్రపంచీకరణ - మూలధనం, సాంకేతిక విజ్ఞానం, వస్తుసేవలు, శ్రామిక గమనశీలతపై ఆంక్షలను తొలగించి స్వేచ్ఛా విధానం ద్వారా 'విశ్వ గ్రామానికి' మార్గం సుగమం చేయడాన్ని సూచిస్తుంది.

ప్రతిభ

ప్రపంచీకరణ అంటే ఏమిటి...?

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ



రచయిత

సీహెచ్. వెంకట్ రెడ్డి

అసిస్టెంట్ ప్రొఫెసర్

నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు

ఇవి దీర్ఘ కాలానికి చెందినవి. సప్లయ్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవి. దీనిలో భాగంగానే భారత ప్రభుత్వం సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు విధానాలను ప్రవేశ పెట్టడానికి కృషిచేసింది.

సరళీకరణ (Liberalisation)

ప్రభుత్వం నియంత్రిత, కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించడాన్ని 'సరళీకరణ' అంటారు. అంటే ప్రభుత్వ జోక్యం తగ్గించి, మార్కెట్ శక్తులకు స్వేచ్ఛను కల్పించడం. లైసెన్సులు, పెట్టుబడి లాంటి విషయాల్లో సరళీకరణ వైపు మొగ్గుచూపారు. సంస్కరణలకు పూర్వం ఏ పరిశ్రమ స్థాపించాలన్నా ప్రభుత్వం నుంచి లైసెన్సులు పొందాల్సి వచ్చేది. కానీ, 1991 ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, సరళీకరణ విధానం ద్వారా 18 రకాల పరిశ్రమలు మినహా మిగతా వాటికి లైసెన్సులు ఎత్తివేశారు. ప్రస్తుతం వీటి సంఖ్యను ఆల్కహాల్, సిగరెట్లు, ప్రమాదకర రసాయనాలు, రక్షణ పరికరాలు, పారిశ్రామిక పేలుడు పదార్థాలాంటి 5 పరిశ్రమలకు పరిమితం చేశారు.

విదేశీ పెట్టుబడులపై పరిమితిని సవరించారు. 49 శాతం అనే పరిమితిని ఎత్తివేశారు. చాలా పరిశ్రమల్లో 74 శాతం వరకు, కొన్ని గుర్తించిన పరిశ్రమల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. గనులు, పోర్టులు, టూరిజం, తేయాకు, కాఫీ, రబ్బరు లాంటి తోట పంటలు, కొరియర్ సేవలు లాంటి వాటిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

ఏకస్వామ్యాల నియంత్రణ చట్టం (MRTP) పరిశ్రమల స్థాపన, విస్తరణకు అవరోధంగా మారిందని గుర్తించి సరళీకరణలో భాగంగా దీన్ని సవరించారు. మౌలిక రంగాలను ప్రభుత్వ రంగానికి పరిమితం చేసి, ఇతర పరిశ్రమల్లో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించారు. పారిశ్రామిక తీర్మానాల్లో పరిశ్రమలను అత్యంత ప్రభావితం చేసిన వాటిలో 1991, జులై 24 న ప్రవేశపెట్టిన తీర్మానం ప్రధానమైంది. ప్రపంచీకరణ భావాలు దీనిపై ప్రభావం చూపాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికి విధానాలను సరళతరం చేశారు. 1991 నుంచి విదేశీ మారక నియంత్రణ చట్టాన్ని (FERA) సడలిస్తూ, విదేశాల్లో భారతీయులు జరిపే లావాదేవీల విషయంలో స్వేచ్ఛను పెంచారు. చివరకు FERA ను 1999 లో విదేశీ మారక నిర్వహణ చట్టం (FEMA) గా మార్చారు. FEMA ను 2000 జూన్ 1 నుంచి అమల్లోకి తెచ్చారు.

ప్రయివేటీకరణ (Privatisation)

గత రెండున్నర దశాబ్దాలుగా ఎంతో ప్రాచుర్యం పొందిన పదం ప్రయివేటీకరణ. దీనికి అర్థం ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్టం చేయడం. పబ్లిక్ సంస్థల యాజమాన్యం, నిర్వహణ భారాన్ని ప్రయివేటుపరం చేసే ప్రయివేటీకరణ ప్రక్రియను 1969 లో ఆచార్య పీటర్ డ్రకర్ తన 'The Age of Discontinuity' లో ప్రస్తావించారు. 1980 లో మార్గరెట్ థాచర్ ఇంగ్లండ్‌లో పబ్లిక్ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియ చేపట్టడంతో ఈ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది.

1980 లలో మన దేశంలో కొన్ని రంగాల్లో ప్రయివేటీకరణ ప్రవేశ పెట్టినప్పటికీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలు, దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానం ప్రయివేటీకరణ ప్రక్రియకు పెద్దపీట వేసింది. పబ్లిక్‌రంగ సంస్థల యాజమాన్యం, ఆస్తులు ప్రయివేటుపరం చేయడం వల్ల సంస్థ యాజమాన్య సామర్థ్యం మెరుగుపడి, ఆర్థిక సమర్థత పెరుగుతుందన్న వాదం బలపడింది.

ప్రయివేటీకరణ ప్రక్రియను మన దేశంలో Disinvestment, ఇంగ్లండ్‌లో Denationalisation, ఆస్ట్రేలియాలో Prioritisations, బొలీవియాలో Industrial transition, బ్రెజిల్‌లో Destatisations, న్యూజిలాండ్‌లో Assets Sales Programme అనే భావనల ద్వారా అమలుచేస్తున్నారు.

1991 లో ప్రయివేటీకరణలో భాగంగా ప్రభుత్వానికి కేటాయించిన పరిశ్రమలను ప్రయివేటు రంగానికి అప్పగించారు. తద్వారా ప్రభుత్వ రంగానికి కేటాయించిన పరిశ్రమలను 8 కి తగ్గించారు. ప్రస్తుతం ఈ పరిశ్రమల సంఖ్యను 2 కి తగ్గించారు. అణుశక్తి, రైల్వే రవాణా మినహా మిగతా అన్ని పరిశ్రమలను ప్రయివేటు రంగంలో స్థాపించుకోవచ్చు.

ప్రయివేటీకరణలో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థల్లోని పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని రూపొందించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాలను ప్రజలకు, సంస్థలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు అమ్మివేయడాన్ని 'పెట్టుబడుల ఉపసంహరణ' (Disinvestment) అంటారు. వ్యూహాత్మకంకాని ప్రభుత్వరంగ సంస్థల్లో భారీగా పేరుకుపోయిన ప్రభుత్వ వనరులను సాంఘిక రంగం వైపు మళ్లించడం, మితిమీరుతున్న ప్రభుత్వ రుణ భారాన్ని తగ్గించే లక్ష్యంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చిన నిధులను 75 శాతం సాంఘిక సేవలపై, మిగిలిన 25 శాతం లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రభుత్వం అనుసరించే సరైన పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహాన్ని సూచించమని ప్రొఫెసర్ రంగరాజన్ అధ్యక్షతన 1992 లో కమిటీని నియమించారు. అదేవిధంగా దీర్ఘకాలంలో ఉత్తమమైన పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని సూచించేందుకు జి.వి.రామకృష్ణ అధ్యక్షతన 1996 లో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్‌ను నియమించారు. తర్వాత దీన్ని పునర్ వ్యవస్థీకరించి ఆర్.హెచ్.పాటిల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం 2000 లో పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.

ప్రపంచీకరణ (Globalisation)

వస్తుసేవలు, మూలధనం, సాంకేతిక విజ్ఞానం, శ్రామికుల ప్రవాహానికి ఎలాంటి అవరోధాలు ఏర్పడకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రపంచీకరణగా వ్యవహరిస్తారు. ప్రపంచీకరణ నాలుగు అంశాల పరిధిలో జరుగుతుంది.

ఎ) వాణిజ్య అవరోధాలు తగ్గించి, వివిధ దేశాల మధ్య వస్తుసేవల ప్రవాహానికి ఉన్న ఇబ్బందులను తొలగించడం.

బి) సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం.

సి) మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.

డి) శ్రామిక గమనశీలతను పెంచడానికి అనుకూలంగా ప్రోత్సహించడం.

ఆచార్య జగదీశ్ భగవతి 'దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేసి వ్యాపారం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వల్పకాల మూలధనం, మానవ వనరులు, సాంకేతిక విజ్ఞాన ప్రవాహాన్ని కొనసాగించడాన్ని స్వేచ్ఛా ఆర్థిక ప్రపంచీకరణ'గా నిర్వచించారు. 'దేశాల రాజకీయ సరిహద్దులను దాటి ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడమే ప్రపంచీకరణ' అని దీపక్ నాయర్ నిర్వచించారు.

ప్రపంచీకరణ లక్షణాలు

ఎ) అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాల్లో వేగవంతమైన వృద్ధి.

బి) వ్యాపార రంగంలో వృద్ధి వేగం సాధించడం, ప్రత్యేకించి బహుళజాతి సంస్థల వ్యాపార వృద్ధి.

సి) బహుళ జాతి సంస్థల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పెరుగుదల.

డి) గ్లోబల్ మార్కెట్ల ఆవిర్భావం.

ఇ) రవాణా, కమ్యూనికేషన్ రంగాల శీఘ్రతర వృద్ధి వల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడం.

ప్రపంచీకరణ దిశగా చర్యలు

భారతదేశం ప్రపంచీకరణ దిశగా మూడు ముఖ్యమైన చర్యలను చేపట్టింది. i) రూపాయి బహిర్గత విలువ సవరణ, రూపాయి పరివర్తనం.

ii) దిగుమతుల సరళీకరణ.

iii) వివిధ దేశీయ ఉత్పత్తి రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.

విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో ప్రభుత్వ జోక్యం లేకుండా డిమాండ్, సప్లయ్ శక్తుల ద్వారా ద్రవ్యం విలువను నిర్ణయించడాన్ని ప్రపంచీకరణ ప్రక్రియలో అతి ముఖ్యమైన చర్యగా పరిగణిస్తున్నారు. 1991 లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత రూపాయిని పరివర్తనం చేసే ప్రయత్నం జరిగింది. ఈ దిశగా భారత ప్రభుత్వం రెండు దశల్లో జులై 1, 3 తేదీల్లో రూపాయి విలువను 18-19 శాతం వరకు తగ్గించి, మూల్యహీనీకరణ చేసింది.

ఆ తర్వాత సంపూర్ణ పరివర్తనం (Full Convertability) లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో పూర్తిగా మన చర్యలు చేపట్టింది. 1992-93 బడ్జెట్‌లో పాక్షిక పరివర్తనం ద్వారా ద్వంద్వ మారకరేటు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను అధికార రేటు వద్ద, మిగిలిన 60 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద ఎగుమతిదారులు పరివర్తనం చేసుకున్నారు. 1993-94 బడ్జెట్‌లో వాణిజ్య ఖాతా లావాదేవీల ద్వారా పొందిన మారకపు ద్రవ్యాన్ని సంపూర్ణంగా (మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద) పరివర్తనం చేసుకునే అవకాశం కల్పించింది. 1994 ఆగస్టు 19 న వర్తమాన ఖాతా లావాదేవీలకు సంపూర్ణ పరివర్తనాన్ని ప్రవేశపెట్టింది.

పచ్చదనంలో.. అవినీతి చిగుళ్లు!



ఉదయగిరి మండలం శకునాలపల్లి వద్దగల సామాజిక అటవీశాఖ నర్సరీలో గతేడాది పంపిణీ చేయగా మిగిలిన మొక్కలను మార్పు(కన్వర్షన్)చేస్తున్నారు. ఇటీవల నర్సరీని 'న్యూస్‌టుడే' సందర్శించగా కూలీలు గతేడాది 6×12 సైజు సంచిలో పెంచిన మొక్కలను 8×12 సైజు సంచుల్లోకి మార్చారు. ఆ సమయంలో సంచిలో కేవలం మట్టిని మాత్రమే నింపారు. పశువుల ఎరువు, డీఏపీ లాంటి మిశ్రమాన్ని కలపలేదు. అయితే అక్కడ పశువుల ఎరువు, డీఏపీని వాడినట్లే లెక్కల్లో చూపించారు.

సీతారామపురం మండలం అయ్యవారిపల్లి, సీతారామపురం, దేవమ్మచెరువు, మారంరెడ్డిపల్లి, నెమళ్లదిన్నె, పబ్బులేటిపల్లి, గుండుపల్లి పంచాయతీల్లో అటవీశాఖ అధికారులు మొక్కల పెంపకానికి సంబంధించి రూ.14.77 లక్షలు ఖర్చుచేసినట్లు లెక్కలు చూపిస్తున్నారు. ఇటీవల సామాజిక తనిఖీ బృందం విచారణకు రాగా అటవీశాఖాధికారులు దస్త్రాలను అప్పగించలేదు. వారు నిధులను రికవరీ కింద రాసి వెళ్లారు.

కోట మండలం కొండుగుంట నర్సరీలో గత ఏడాది కొందరు ఉపాధి కూలీల పేరుతో పనులు చేసినట్లుగా నగదు డ్రా చేశారు. కూలీలకు పని దినాలు పూర్తి అయ్యాయని అధికారులు పనులు చూపలేదు.చివరికి బినామీ కూలీల పేరుతో సొమ్ము స్వాహా చేసినట్లు తేలింది.

రాపూరు , వెంకటగిరి అటవీ రేంజిల్లోని నర్సరీల్లో ఏడాదికి రెండు దఫాలు పెంచే మొక్కలకు గ్రేడింగ్ చేయాలి. అధికారులు ఒకసారి మాత్రమే చేసి రెండు సార్లు చేసినట్లు నిధులు డ్రా చేస్తున్నారు.

ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం నర్సరీలో నిర్వహణ లోపంతో మొక్కలు దెబ్బతిన్నాయి. పెంపకంలో ప్రభుత్వ లక్ష్యం సజావుగా ముందుకు సాగడంలేదు.

వెంకటాచలం మండలంలో నాలుగు గ్రామాల్లో రోడ్ల పక్కన మొక్కలు నాటారు. మొక్కలు నాటడం, సంరక్షణకు రూ.9.31లక్షలు కేటాయించారు. రెండు నెలల కిందట జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు రికార్డులు అడగ్గా అటవీశాఖ సిబ్బంది ఇవ్వలేదు. ఉపాధి హామీ, అటవీశాఖ అధికారులు తమకు రికార్డులు అందజేయలేదని రూ.9.31 లక్షలు దుర్వినియోగం అయినట్లుగా గుర్తించి రికవరీకి ఆదేశించారు.



ఉదయగిరి: నర్సరీలో వాడిపోతున్న మొక్కలు

న్యూస్‌టుడే, బృందం

జిల్లాలో టెరిటోరియల్, సామాజిక వన విభాగాల ద్వారా గతేడాది సుమారు కోటి మొక్కలను పెంచేలా నిర్దేశించారు. టెరిటోరియల్ నర్సరీలు 60 వరకు ఉండగా సామాజిక వన విభాగం నర్సరీలు 48 ఉన్నాయి. నర్సరీల్లో మొక్కలను పెంచే బాధ్యతలను అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. మొదట మొక్కలు పెంచే సమయంలో 6×12 సైజు సంచిలో సారవంతమైన మట్టి, అందుకు సరిపోయేలా ఇసుక, పశువుల ఎరువు, డీఏపీని కలిపి ప్యాకెట్‌లో నింపాలి. నిర్దేశించిన కాల వ్యవధిలో మొక్కకు ఏదైనా తెగులుసోకితే నివారణకు పురుగుమందును పిచికారీ చేయాల్సి ఉంది. ఈ లెక్కన ఒక్కో మొక్క పెంపకానికి ప్రభుత్వం రూ. 10 వరకు నిధులను వెచ్చిస్తుంది. కొన్నిచోట్ల ఈనిబంధనలు పాటించకుండా నర్సరీల్లో మొక్కల పెంపకంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మొక్కలు గిడసబారి ఎండిపోతున్నాయి.

అడుగడుగునా చేతివాటమే

జిల్లాలో గతేడాది నర్సరీల్లో సుమారు కోటి వరకు మొక్కలు పెంచగా 30 లక్షల వరకు పంపిణీ జరిగింది. మిగిలిన మొక్కలను తిరిగి పెద్దసైజు 8×12 ప్యాకెట్లలో కన్వర్షన్ చేసి వాటిని పెంచి మరలా పంపిణీచేయాలని పెంపకం చేస్తున్నారు. మార్పులో మట్టి, ఇసుక, పశువుల ఎరువు, డీఏపీ, కూలీల ఖర్చు, నీటిని పట్టేందుకు తదితర అవసరాలకు ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా ఒక్కో మొక్కకు సుమారు రూ. 9.60 వెచ్చిస్తుంది. కేవలం మట్టితోనే నింపేస్తున్నారు. నర్సరీల బాధ్యతలను చూసే క్షేత్రస్థాయి అటవీశాఖ సిబ్బంది చేతివాటం చూపుతూ ప్రభుత్వం కేటాయించే నిధుల పక్కదారి పట్టించేస్తున్నారు. జిల్లాలో టెరిటోరియల్ విభాగం ద్వారా మొక్కల పెంపకానికి ఇప్పటి వరకు రూ. 10.58 కోట్లు, సామాజిక వన విభాగం ద్వారా రూ. 19.63 కోట్లు ఖర్చుచేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలో లక్ష్యంమేర మొక్కల పంపిణీ లక్ష్యం నెరవేరటంలేదు.

గూడూరు నియోజకవర్గంలోని ఆటవీ శాఖ నర్సరీల్లో మొక్కల పెంపకం, పంపిణీలో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. బినామీ కూలీలతో పనులు చేయిస్తున్నారు. అర్హులైన కూలీల పేరుతో పనులు చేసినట్లుగా చూపుతున్నారు.

ఆత్మకూరు నియోజకవర్గంలో అటవీ శాఖ నిర్వహించే నర్సరీలు అధ్వానంగా ఉన్నాయి. నర్సరీల్లో పెరిగిన మొక్కకు

నిబంధనలు పాటించని నర్సరీలు
కానరాని ఎరువులు, పురుగుమందుల వినియోగం
దొంగ లెక్కలతో నిధుల పక్కదారి

మార్చాల్సిన సంచులు సకాలంలో మార్చడం లేదు. పెంచిన మొక్క ఆ ఏడాది పంపిణీ చేయలేకపోతే వాటిని సంరక్షిస్తూ నియమిత కాలంలో సంచులు మార్చి తాజాగా ఉండేలా చేయాలి. అలా చేయడం లేదు.



వెంకటాచలం: ఎండిపోయిన మొక్కలు

సర్వేపల్లి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో కలిసి అటవీశాఖ అధ్వర్యంలో ఉపాధి పథకం కింద రూ. 26 లక్షలు ఖర్చుచేసి రోడ్ల పక్కన మొక్కలు నాటారు. సంరక్షణను వదలి వేయటంతో 50 శాతం మొక్కలు కూడా బతకలేదు.

నాయుడుపేట స్వర్ణముఖి నర్సరీ సమీపంలో సామాజిక వనవిభాగం ఆధ్వర్యంలో మొక్కల పెంపకం జరుగుతోంది. ఇక్కడి నర్సిరీల్లో పెరుగుతున్న మొక్కలు ఎరువులను వినియోగించకుండానే మట్టితో నింపడం వలన నాణ్యత కొరవడుతోంది.



నాయుడుపేట : స్వర్ణముఖి నర్సరీలో సేంద్రియ ఎరువులు లేకుండా పెరిగిన మొక్కలు

నెలరోజులే పనిచేశా..

– జి.పి.ఆనంద్ సామాజిక వన విభాగం ఇన్‌ఛార్జి డీఎఫ్‌వో

నర్సరీల్లో మొక్కల పెంపకంలో నిర్దేశించిన ప్రమాణాలు పాటించని విషయాన్ని 'న్యూస్‌టుడే' సామాజిక వన విభాగం ఇన్‌ఛార్జి డీఎఫ్‌వో ఆనంద్ దృష్టికి తీసుకెళ్లగా ఈరోజుతో ఇన్‌ఛార్జి బాధ్యత ముగిసిందన్నారు. రెగ్యులర్ డీఎఫ్‌వో గురువారం బాధ్యతలు చేపడతారన్నారు. నెలరోజులపాటు మాత్రమే ఇన్‌ఛార్జిగా చేశా. అందువల్ల పూర్తిస్థాయి సమాచారం లేదని చెప్పారు.

కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

ఏపీఎస్‌ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్

బృందావనం నెల్లూరు (రవాణా); సెప్టెంబర్ 9న జరిగే కౌన్సిల్ సమావేశంలో జిల్లాలోని అన్ని డిపోలలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు నిచ్చింది. బుధవారం ఆర్టీసీ ప్రాంగణంలోని అసోసియేషన్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎం. థామస్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో జరిగే కౌన్సిల్ సమావేశంలో సభ్యులు, కార్మికులు పాల్గొని తమ సమస్యలు తెలియ చేయాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆర్టీసీ యాజమాన్యం గుర్తింపు పొందిన సంఘమన్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని రీజియన్‌లలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. రాబోవు కాలంలో కార్మికులు ఎదుర్కొంటున్న పదోన్నతి, ఇతర సమస్యలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ ముందుంటుందన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కార్మికులు ప్రతి ఒక్కరూ తమ సమస్యల పరిష్కారానికి సంస్థను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అద్యక్షులు డి. శ్రీనివాసులు, కార్యదర్శి టి. నరసింహులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం. థామస్‌రావు, ఎజ్రాశాస్త్రి

గృహనిర్మాణాలు అక్టోబర్ 2లోగా పూర్తిచేయాలి: కలెక్టర్

వ్యవసాయం(నెల్లూరు), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 12 ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గృహనిర్మాణాలు అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ముత్యాలరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆయా కాలనీల్లో తాగునీరు, సీసీరోడ్ల, విద్యుద్ధీకరణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గృహాలు లేని వారి వివరాలను పరిశీలించి లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలన్నారు. లబ్ధిదారులకు రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. వికలాంగులకు వారి కోటా ప్రకారం గృహనిర్మాణాలు చేపట్టాలన్నారు. హౌసింగ్‌శాఖ పీడి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అమర్‌నాధ్‌రెడ్డి రాక

వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎన్. అమర్‌నాధ్‌రెడ్డి గురువారం ఉదయం వెంకటగిరికి వస్తారు. అక్కడ జరిగే తెదేపా పార్టీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం తిరుపతికి బయలుదేరి వెళతారు.